# సూర్య ఉదయం

ప్రతి పదం... ప్రజా శ్రేయస్కరం

తెలుగు దిన పత్రిక



విలేకరులు కావలెను

సూర్య ఉదయం తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర పదేశ్ ,తెలంగాణలో అన్ని నియోజకవర్గ, కేంద్రాలలో అసక్తి గల విలేకరులు కావలెను. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడునుపూర్తి వివరాలకు సంప్రదించండి.

ఐడి కార్డు ఉచితం

యం.సునిల్ కుమార్

సూర్య ఉదయం తెలుగు దిన పత్రిక ఎడిటర్

సెల్ : 08512 254632



ఎడిటర్ : యం. సునీల్ కుమార్ సంపుటి : 08 సంచిక : 251 గురువారం 03 - 09 - 2026 పేజిలు : 08 వెల రూ. 2 రూ/

Published From Kurnool : Circulated at VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam,Chittoor, Kurnool, Kadapa, Anantapuram, Hyderabad


రాజకీయాల్లో యువతకు ప్రత్యేక స్థానం కల్పించాలనే

# 'జై కొట్టు' యువజన విభాగం

- జనసేన యువజన విభాగం 'జై కొట్టు' లోగో ఆవిష్కరణ
- యువతకు ఛాన్స్
- "చెయ్యెత్తి జై కొట్టు" నినాదం మనందరినీ ఎంతో కదిలిస్తుంది
- రాజకీయాల్లో యువతకు ప్రత్యేక స్థానం కల్పించాలనే యువజన విభాగం ఏర్పాటు చేశామన్న మంత్రి నాదెండ్ల మనోహర్
- జనసేన యువజన విభాగానికి 'జై కొట్టు'గా నామకరణం
- పిఠాపురంలో లోగోను ఆవిష్కరించిన మంత్రి నాదెండ్ల మనోహర్
- ఆడియో సందేశం ద్వారా శుభాకాంక్షలు తెలిపిన పవన్ కల్యాణ్
- పవన్ జన్మదిన వేడుకలతో కలిసి ఘనంగా జరిగిన కార్యక్రమం




**అమరావతి :**

యువతరానికి జనసేన జై కొట్టింది. ఆ పార్టీ యువజన విభాగానికి "జైకొట్టు" అని నామకరణం చేసింది. పవన్ కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా 'జై కొట్టు' లోగో పిఠాపురంలో ఆవిష్కరించారు. కేరళలో చికిత్స తీసుకుంటున్న కారణంగా ఈ సభకు రాలేకపోయిన పవన్ కల్యాణ్ శ్రేణులకు ఆడియో సందేశం ఇచ్చారు. రాజకీయాల్లో యువతకు అవకాశాలు కల్పించేందుకే ఈ వేదిక ఏర్పాటు చేసినట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ "చెయ్యెత్తి జై కొట్టు" నినాదం మనం దరినీ ఎంతో కదిలిస్తుందన్నారు. ఆ స్ఫూర్తిని మీకు అందించాలనే అధినేత పవన్ ఈ లోగో పెట్టారని కార్యక్రమంలో పాల్గొన్న వారితో నాదెండ్ల మనోహర్ అన్నారు. జై కొట్టు నినాదంతో ముందు కెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందని స్పష్టం చేశారు. రాజకీయాల్లో యువతకు ప్రత్యేక స్థానం కల్పించాలనే ఈ విభాగాన్ని ఏర్పాటు చేశామని మంత్రి నాదెండ్ల అన్నారు. అరుపులు, కేకలు కాదు క్రమశిక్షణ - మిగతా 2 లో

# ఉత్తరాంధ్రలో మరో కీలక ఘట్టం ఆవిష్కృతం

- అనకాపల్లి గడ్డను ముద్దాడిన గోదావరి జలాలు
- పోలవరం ఎడమ కాలువ నుంచి నీరు విడుదల చేసిన సీఎం చంద్రబాబు
- పాయకరావుపేట వద్ద రెగ్యులేటర్ ఆన్ చేసి నీటి విడుదల
- పోలవరం ఎడమ కాలువలో గోదారమ్మకు జలహారతి పట్టి ఆహ్వానం



**అమరావతి :**

ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల సాకారమైంది. గోదారమ్మ పరవళ్లు తొక్కుతూ తూర్పు కనుమలను దాటుకుంటూ ఉత్తరాంధ్ర నేలను పలకరించింది. పోలవరం ప్రాజెక్టు ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలు అనకాపల్లి జిల్లాకు చేరుకున్నాయి. నదులు, - మిగతా 2 లో

# సిక్కింలో 40 ప్రమాదకర సరస్సులు గుర్తింపు

- సిక్కింను వెంటాడుతున్న హిమ సరస్సుల ముప్పు
- రాష్ట్రంలో 40 ప్రమాదకర సరస్సులను గుర్తించిన అధికారులు
- వీటిలో 7 అత్యంత ప్రమాదకరమని హెచ్చరిక
- నేపాల్ వరదల నేపథ్యంలో అప్రమత్తమైన యంత్రాంగం - మిగతా 2 లో

# వైఎస్సార్ 17వ వర్ధంతి ఇడుపులపాయలో జగన్ నివాళి



- తండ్రి సమాధి వద్ద అంజలి ఘటించిన వైఎస్ జగన్
- కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్ విజయమ్మ, భారతి, కుటుంబ సభ్యులు
- వైఎస్సార్‌ను స్మరించుకుంటూ ప్రత్యేక ప్రార్థనలు

**అమరావతి :**

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు నివాళులర్పించారు. ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద ఆయన తనయుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అంజలి ఘటించారు. తన తల్లి వైఎస్ విజయమ్మ, భార్య భారతి, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి ఆయన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సమాధిని పుష్పగుచ్ఛాలతో అలంకరించి, కుటుంబ సభ్యులు నివాళులర్పించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కూడా ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహానేతను స్మరించుకుంటూ వారు అంజలి ఘటించారు. 2004 నుంచి 2009 - మిగతా 2 లో

# ఆగ్రాలో ఇద్దరికి ఎబోలా పాజిటివ్



- ఆగ్రాలో ఇద్దరికి సోకిన ఎబోలా
- ఉత్తరప్రదేశ్‌లో ఆసుపత్రులను హై అలర్ట్
- వారికి, వారి కుటుంబాలను ఐసోలేషన్‌లో ఉంచిన వైద్యులు
- ఇద్దరు వ్యక్తులు దిల్లీ, ముంబయి అంతర్జాతీయ విమానాశ్రయాలకు వెళ్లినప్పుడు పరీక్ష చేయగా ఎబోలా పాజిటివ్ అని తేలింది

**ఢిల్లీ :**

కాంగో నుంచి భారత్‌లోని ఆగ్రాకు వచ్చిన ఇద్దరు వ్యక్తులకు ఎబోలా వైరస్ సోకింది. దీనితో ఉత్తరప్రదేశ్‌లో ఆసుపత్రులను హై అలర్ట్ చేశారు. ఈ వైరస్ ఇతరులకు వ్యాపించకుండా నిరోధించేందుకు అధికారులు ఆ ఇద్దరిని, వారి కుటుంబాలను ఐసోలేషన్‌లో ఉంచారు. ఆగ్రా ఇన్‌ఛార్జ్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ (సీఎంఓ) డాక్టర్ అమిత్ రావత్ మాట్లాడుతూ, "ఈ ఇద్దరు వ్యక్తులు దిల్లీ, ముంబయి అంతర్జాతీయ విమానాశ్రయాలకు వెళ్లినప్పుడు, వారి నుంచి స్క్రీనింగ్ నమూనాలను సేకరించారు. పరీక్ష చేయగా ఎబోలా పాజిటివ్ అని తేలింది. దీనితో మేము నిపుణుల బృందాలను అప్రమత్తం - మిగతా 2 లో

# భారత్, చైనా, అమెరికా నుంచి నష్టపరిహారం కోరిన నేపాల్ మంత్రి

- నేపాల్ ఆకస్మిక వరదల వల్ల ఇప్పటి వరకు 11 వందల మందికి పైగా మృతి
- పారిశ్రామిక దేశాలు విడుదల చేసే ఉద్గారాల వల్ల తాము మూల్యం చెల్లించుకుంటున్నామన్న నేపాల్
- తమకు నష్టపరిహారం చెల్లించడం చట్టపరమైన బాధ్యత అని వ్యాఖ్య



**ఢిల్లీ :**

నేపాల్‌ను ముంచెత్తిన ఘోర జలప్రళయం తీవ్ర నష్టాన్ని మిగిల్చిన వేళ, ఆ దేశ ప్రభుత్వం అంతర్జాతీయ వేదికలపై కీలక విజ్ఞప్తి చేసింది. ప్రపంచంలోనే అత్యధికంగా గ్రీన్‌హౌస్ వాయువులను విడుదల చేస్తున్న భారత్, చైనా, అమెరికా దేశాల నుంచి 'వాతావరణ మార్పుల నష్టపరిహారం' కోరుతూ నేపాల్ విదేశాంగ మంత్రి శిశిర్ ఖనాల్ సంచలన ప్రకటన చేశారు.భోటేకోషి నదిలో - మిగతా 2 లో

తమిళనాడు ఆలయాల్లో

# స్మార్ట్‌ఫోన్లపై నిషేధం




- అమల్లోకి కొత్త నిబంధన
- తమిళనాడులోని 52 ప్రధాన ఆలయాల్లో స్మార్ట్‌ఫోన్లపై నిషేధం
- దర్శనానికి ముందు కౌంటర్‌లో ఫోన్ డిపాజిట్ చేయడం తప్పనిసరి
- ఆలయ పవిత్రత, ప్రశాంతతను కాపాడేందుకే ఈ నిర్ణయం
- కెమెరా లేని సాధారణ ఫోన్లకు మాత్రం అనుమతి

**చెన్నై :**

తమిళనాడులోని ప్రధాన దేవాలయాల్లో భక్తుల స్మార్ట్‌ఫోన్ల వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. హిందూ మత, ధర్మాదాయ - మిగతా 2 లో



# వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలన ప్రజా రంజకం

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- ఆర్థిక లోటు ఉన్నా సంక్షేమం ఆపలేదు
- వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- సామాన్యుల కష్టాలు తీర్చేందుకు నిరంతరం కృషి చేశామన్న పొంగులేటి
- రైతు సంక్షేమానికి రూ.1.76 లక్షల కోట్లు ఖర్చు చేశామని వెల్లడి

**హైదరాబాద్ :**

తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనను పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... తమ ప్రజా పాలనలో సామాన్యుల - మిగతా 2 లో

నేను చెప్పాల్సినవన్నీ చెప్పా

# అధిష్ఠానం నిర్ణయం కోసం వేచి చూస్తున్నా



- 'రాజీనామా'పై కొండా సురేఖ కీలక వ్యాఖ్యలు
- కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నాన్న మంత్రి కొండా సురేఖ
- ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేతో భేటీ అయినట్లు వెల్లడి
- తనను ఇంతవరకు రాజీనామా చేయమని చెప్పలేదని వివరణ

**హైదరాబాద్ :**

తన కుమార్తె చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయొద్దని కాంగ్రెస్ పెద్దలను కోరినట్లుగా మంత్రి కొండా సురేఖ తెలిపారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసి తన వివరణ ఇచ్చినట్లు చెప్పారు. తన వ్యవహారంపై పార్టీలో చర్చించి ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో తెలియదని తెలిపారు. దిల్లీలో - మిగతా 2 లో

# రక్షణ ఎక్స్‌పోకు రండి అనుమతులు ఇప్పించండి

- ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన
- కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కలిసిన సీఎం రేవంత్ రెడ్డి
- ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026 సమ్మిట్ కు రాజ్‌నాథ్ ను ఆహ్వానించిన రేవంత్
- ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు 1500 ఎకరాలు సేకరించి ఇస్తామన్న సీఎం
- డీఆర్‌డీఎల్ ప్రాజెక్టుకు ఉచితంగా భూమి కేటాయించాలని విన్నపం
- రాష్ట్రంలో విమానాశ్రయాల విస్తరణపై రామ్మోహన్ తో చర్చించిన సీఎం



**హైదరాబాద్ :**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్‌లో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026కు హాజరుకావాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను సీఎం రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. సదస్సులో భాగంగా నిర్వహించే రక్షణ ఎక్స్‌పోను ప్రారంభించాలని, కావాల్సిన అనుమతులనూ మంజూరు చేయాలని కోరారు. దేవరకద్ర డీఆర్‌డీఎల్ ప్రాజెక్టుకు ఉచితంగా భూమి ఇస్తామని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు ఇప్పటికే 750 ఎకరాల భూసేకరణ జరుగుతోందన్న సీఎం, మరో 750 ఎకరాలు సేకరించి ఇస్తామని కేంద్రమంత్రికి చెప్పారు.భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7 నుంచి 9 వరకు ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026 నిర్వహించనున్నట్లు సీఎం రేవంత్ కేంద్రమంత్రికి తెలిపారు. సదస్సులో భాగంగా నిర్వహించే రక్షణ ఎక్స్‌పోను ప్రారంభించాలని కోరారు. దిల్లీలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో సమావేశమైన రేవంత్ రెడ్డి రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రక్షణ ఎక్స్‌పోలో ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాలకు సంబంధించిన ప్రత్యేక సదస్సు నిర్వహిస్తామన్నారు. ఎయిర్‌షో, పారిశ్రామిక, భూ రక్షణ వ్యవస్థల ప్రత్యక్ష ప్రదర్శనలు ఉంటాయని వివరించారు. రక్షణ రంగ పరిశ్రమలు, స్టార్టప్‌లు, యువ శాస్త్రవేత్తలు ఎక్స్‌పోలో పాల్గొంటారని, ఇలాంటి సదస్సుకు - మిగతా 2 లో

# సంపాదకీయం

## పచ్చి దోపిడీ..!

వెనెజువెలాలో 65 బిలియన్ బ్యారెళ్ల చమురు నిల్వలు తమ అధీనంలోకి వచ్చే ఒప్పందం కుదిరిందంటూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ శుక్రవారం ప్రకటించారు. ప్రపంచ చరిత్రలోనే అతిపెద్ద చమురు ఒప్పందంగా దీనిని అభివర్ణించారాయన. ఒక అర్ధరాత్రివేళ అమెరికన్ సైనికబలగాలు విమానాల్లో దిగి, వందలాదిమంది వెనెజువెలా భద్రతాదళాలను కాల్చిచంపి, ఆ దేశాధ్యక్షుడు నికోలస్ మదురోను అపహరించుకుపోయి అమెరికా జైళ్ళలో కుక్కిన ఎనిమిది నెలల్లోనే ట్రంప్ అసలు లక్ష్యం నెరవేరడం మొదలైందన్నమాట.అరవై ఐదు బిలియన్ బ్యారెళ్ళ చమురు నిల్వలున్న ఈ క్షేత్రాల పరిమాణం వెనెజువెలా మొత్తం చమురు క్షేత్రాల్లో ఐదోవంతు. ప్రపంచంలోనే అత్యధిక చమురు నిల్వలున్న ఈ దేశంలోని క్షేత్రాలు పూర్తిగా అమెరికా నియంత్రణలోకి పోవడం ఇక ఎంతో దూరంలో లేదని అర్థం. అమెరికా సన్నిహితుడైన వెనెజువెలా వ్యాపారవేత్త అలెజాండ్రో బెటన్‌కోర్ట్ ఈ పదిహేడు క్షేత్రాల నుంచి తైలం తవ్వితీయబోతున్నారని, ఈ దెబ్బతో ఆయన కంపెనీ 'నార్త్ అమెరికన్ బ్లూ ఎనర్జీ పార్ట్‌నర్స్' ఆ దేశంలో రెండవ అతిపెద్ద ప్రైవేటు చమురు కంపెనీగా అవతరిస్తుందని ఒక ప్రముఖ ఆంగ్ల దినపత్రిక అంటోంది. ఈ భారీ చమురు ఒప్పందంలో పెంటగాన్‌కూ వాటా దక్కబోతున్నదని, దాని 'ఆఫీస్ ఆఫ్ స్ట్రాటజిక్ క్యాపిటల్' (ఓఎస్‌సీ) పెన్నీవారెంట్‌తో అంటే, దాదాపు సున్నా పెట్టుబడితో 35శాతం వాటాని, ఉత్పత్తికి వ్యయానికే ఐదోవంతు చమురునూ కొనుగోలు చేయగలిగే హక్కులను పొందబోతున్నట్టు ఆ పత్రిక విశ్లేషించింది. ఒక్క ముక్కలో చెప్పాలంటే, డోనాల్డ్ ట్రంప్ తన 200వ కార్యనిర్వాహక ఆదేశంలో 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ వార్'గా నామకరణం చేసిన అమెరికా రక్షణశాఖ, తాను ఎనిమిది నెలల క్రితం చొరబడిన దేశంలో అతిపెద్ద చమురు క్షేత్రాలకు యజమానిగా అవతరించబోతున్నదని అర్థం.వెనెజువెలాలో అమెరికా వీరవిధేయ తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగిజ్ ఈ ఒప్పదం గురించి ఏం చెబుతారో ఊహించడం కష్టం కాదు. వందబిలియన్ డాలర్ల పెట్టుబడులు, వేలాది ఉద్యోగాలతో దేశం కళకళలాడిపోతుందనీ, చమురు ఉత్పత్తి ద్విగుళం బహుళమై ఆర్థికవ్యవస్థ అద్భుతంగా తయారవుతుందన్నారు ఆమె. పూర్తి రహస్యంగా జరిగిన ఈ ఒప్పందం గురించి ట్రంప్ బయటకు చెప్పేవరకూ వెనెజువెలాలో ఎవరికీ తెలియదు. చమురు క్షేత్రాల కేటాయింపుల ద్వారా ప్రభుత్వానికి వచ్చే రాయల్టీ కూడా, వందేళ్ళక్రితం అమెరికా అనుకూల నియంత గోమేజ్ అమెరికన్ కంపెనీలనుంచి వసూలు చేసినదానికంటే ఎంతో తక్కువట. ఈ ఏడాది ఆరంభంనుంచి అమెరికా తరలించుకుపోయిన చమురుకు చెల్లించాల్సిన మొత్తాన్ని కూడా వెనెజువెలాకు ఇంకా ఇవ్వలేదట. మొన్న జూన్‌లో గత 125 ఏళ్ళలో ఎన్నడూ లేనంత భయంకరమైన భూకంపంతో వెనెజువెలా భారీగా నష్టపోయింది. వందలాదిమంది మరణించారు, నిరాశ్రయులైన వేలాది మంది ఇంకా టెంట్లలోనే జీవిస్తున్నారు. కేవలం రెండునెలల్లో కుదిరిన ఈ ఒప్పందం ఆ దేశాన్ని ఆదుకోవడం కాక, దోచుకోవడం మీద అమెరికాకు ఉన్న శ్రద్ధను తెలియచెబుతోంది. అమెరికా పెట్టిన 'నార్కో టెర్రరిజం' కేసులతో బ్రూక్లిన్ జైల్లో ఉన్న మదురో భూకంపం సమయంలో తన ప్రజలకు సంఘీభావంగా విడుదల చేసిన ఫోటో ఒకటి, ఈ చమురు ఒప్పందం కుదిరిన మర్నాడే వెలుగుచూడటం చక్కగా అతికినట్టు సరిపోయింది.ఇరాన్ యుద్ధంలో చేయి కాల్చుకొని, రేటింగ్ కూడా బాగా పడిపోయిన ట్రంప్ నవంబరులో మధ్యంతర ఎన్నికలు జరగబోతున్న తరుణంలో, ఈ ఒప్పందాన్ని ఆకాశానికి ఎత్తేస్తున్నారు. ఇప్పటికే వ్యూహాత్మక చమురునిల్వలు వేగంగా ఖాళీ అవుతూ, కేవలం ఈ ఎనిమిది నెలల కాలంలోనే మూడోవంతు ఖర్చయిన నేపథ్యంలో, వెనెజువెలా చమురు మన ఖాళీపీపాలను నింపుతుందని ట్రంప్ ప్రజలకు హామీ ఇస్తున్నారు. అమెరికన్ రిఫైనరీలకు కారుచవుక వెనెజువెలా చమురు వచ్చి చేరి, ఇంధన ధరలు విపరీతంగా తగ్గి జనానికి మేలు చేకూరుతుందని హామీ ఇస్తున్నారు. రష్యా చమురు కొనుగోలు చేస్తూ, ఉక్రెయిన్‌మీద పుతిన్ చేస్తున్న యుద్ధానికి ఇంధనం అందిస్తున్నారంటూ భారత్ సహా పలుదేశాల మీద ట్రంప్ వీరంగం వేస్తూ ఆంక్షలూ సుంకాలతో వాటికి ఆర్థికంగా ఊపిరాడకుండా చేస్తున్నారు. తానుమాత్రం వెనెజువెలా చమురుతో ఇరాన్, రష్యాల మీద యుద్ధానికి ఏ అడ్డంకులూ రాకుండా చూసుకుంటున్నారు.

## ఉత్తరాంధ్రలో మరో కీలక ఘట్టం ఆవిష్కృతం



మొదటిపేజీ తరువాయి - కొండలను తొలిచి ఇంజినీరింగ్ అద్భుతంగా రూపుదిద్దుకున్న కాలువ ద్వారా తరలివచ్చిన గోదారి తల్లికి ముఖ్యమంత్రి చంద్రబాబు పాయకరావుపేటలో అఖండ జలహారతితో స్వాగతం పలికారు. గోదారి జల సవ్వడులు ఉత్తరాంధ్ర నేలను ముద్దాడాయి. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రులు, ప్రజాప్రతినిధులతో కలిసి గోదావరి నీళ్లను ఉత్తరాంధ్రకు తరలించే పైలాన్ లాగి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అపురూప క్షణాలను కలకాలం గుర్తుండేలా అందరితో కలిసి గ్రూప్ ఫోటో దిగారు.ఆ తర్వాత నేతలతో కలిసి ఓపెన్ టాప్ జీపులో ప్రజలకు అభివాదం చేస్తూ పోలవరం కాలవ వద్దకు చేరుకున్నారు. ఈ సమయంలో చంద్రబాబుకు స్వాగతం పలుకుతూ కోలాటంతో పాటు ఉత్తరాంధ్ర సంప్రదాయ నృత్యం తప్పెటగుళ్లను ప్రదర్శించారు. నృత్యాలను తిలకించిన చంద్రబాబు వారిని అభినందించారు. అనంతరం పోలవరం ఎడమ కాలువ ద్వారా ఉత్తరాంధ్రకు నీళ్లను తరలించే మ్యాప్‌తోపాటు దయాగ్రమ్‌ను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.తర్వాత కాలువపై ఏర్పాటు చేసిన గేట్ల దగ్గరికి చేరుకున్న చంద్రబాబు రెగ్యులేటర్ ఆన్‌చేసి అనకాపల్లి జిల్లాకు నీటిని విడుదల చేశారు. తర్వాత గోదారమ్మకు సంప్రదాయ బద్ధంగా పూజలు చేశారు. గోదావరి తల్లికి సారె సమర్పించారు. నాగహారతి ఇచ్చారు. నీళ్లను నెత్తిన చల్లుకుని పులకించారు. చుట్టూ ఉన్న నేతలతోపాటు ప్రజలపైనా గోదావరి జలాలను చల్లారు. అనంతరం గేట్ల దగ్గరికి చేరుకున్న చంద్రబాబు గోదావరి తల్లికి సాష్టాంగ నమస్కారం చేశారు. తర్వాత మరో గేటు దగ్గర రైతులతో కలిసి రెగ్యులేటర్ ఆన్‌చేసి నీటిని విడుదల చేశారు. తర్వాత నీటి ప్రవాహాన్ని పరిశీలించారు.తమ ప్రాంతానికి వచ్చిన గోదారమ్మను చూసిన ప్రజలు పరవశించిపోయారు. ఎన్నో ఏళ్ల సుదీర్ఘ స్వప్నం ఎట్టకేలకు నెరవేరిందంటూ పులకించిపోయారు. తమ ఆకాంక్షను నెరవేర్చిన కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు. గోదారి తల్లికి వినయంగా నమస్కరించి తమ కృతజ్ఞతను చాటుకున్నారు.

## ఆగ్రాలో ఇద్దరికి ఎబోలా పాజిటివ్

మొదటిపేజీ తరువాయి - చేశాం. రోగులు ఇద్దరినీ, వారి కుటుంబాలను హోమ్ ఐసోలేషన్‌కు తరలించాం. అయితే ప్రస్తుతం ఆ ఇద్దరిలో ఆ ఇన్ఫెక్షన్‌కు సంబంధించిన సాధారణ లక్షణాలు మాత్రమే కనిపించాయి. వారిపై ఎలాంటి తీవ్రమైన ప్రభావం లేదు. కనుక వారు ప్రమాదం నుంచి బయటపడ్డారు. అయినప్పటికీ ప్రస్తుతం వైద్య బృందాలు వాళ్లను, వారి కుటుంబ సభ్యులను నిరంతరం పర్యవేక్షిస్తున్నాయి. ఇన్ఫెక్షన్ సోకిన ఏ వ్యక్తి కూడా తమ దృష్టి నుంచి తప్పించుకోకుండా ఉండడానికి అదనపు నమూనాలను సేకరిస్తున్నాం" అని చెప్పారు.

### ఎబోలా లక్షణాలు ఇవే!

వైద్యుల ప్రకారం, ఎబోలా సోకిన వారికి ప్రారంభ దశలో తీవ్రమైన జ్వరం, చలి, బలహీనత, అలసట, తలనొప్పి, కండరాల నొప్పులు, కీళ్ల నొప్పులు, గొంతు నొప్పి వంటి లక్షణాలు ఉంటాయి. ఇన్‌ఫెక్షన్ ముదిరే కొద్దీ రోగుల్లో వాంతులు, విరేచనాలు, తీవ్రమైన కడుపు నొప్పి, వికారం, చర్మంపై దద్దుర్లు రావచ్చు. తీవ్రమైన కేసుల్లో కిడ్నీ, కాలేయం పనితీరు దెబ్బతినవచ్చు. దీనితోపాటు చిగుళ్లు, ముక్కు, కళ్లు, ఇంజెక్షన్ చేసిన ప్రదేశాల నుంచి అంతర్గతంగా, బాహ్యంగా రక్తస్రావం జరగవచ్చు. లేదా వాంతులు, మలంతో రక్తం పడవచ్చు. గందరగోళం, చిరాకు, తీవ్రమైన అశాంతి వంటి నరాల సంబంధిత లక్షణాలు కూడా ఉండవచ్చు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ఎబోలా వ్యాప్తిని ప్రజారోగ్య అత్యవసర పరిస్థితిగా ప్రకటించినప్పటి నుంచి భారతదేశం సరిహద్దుల్లో కఠినమైన నిబంధనలను అమలు చేస్తోంది.

## భారత్, చైనా, అమెరికా నుంచి నష్టపరిహారం కోరిన నేపాల్ మంత్రి

మొదటిపేజీ తరువాయి - సంభవించిన ఆకస్మిక వరదల వల్ల ఇప్పటికే 1,100 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, వేలాది మంది గల్లంతయ్యారు. ఈ తీవ్ర విపత్తు వాతావరణ మార్పుల వల్ల హిమనీనదాలు (గ్లేసియర్లు) విరుచుకుపడటం వల్లే సంభవించిందని శిశిర్ ఖనాల్ పేర్కొన్నారు. వాతావరణ మార్పులకు తమ దేశం కారణం కాకపోయినా, అతిపెద్ద పారిశ్రామిక దేశాలు విడుదల చేసే ఉద్గారాల వల్ల తాము తీవ్ర మూల్యం చెల్లించుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది తమకు ఇచ్చే సాయం లేదా భిక్ష కాదని, బాధితులకు చెల్లించాల్సిన చట్టపరమైన, నైతిక బాధ్యత అని స్పష్టం చేశారు.తమ దౌత్య విధానాన్ని 'సాయం కోరడం' నుంచి 'న్యాయం, నష్టపరిహారం పొందే' దిశగా మారుస్తున్నట్లు వెల్లడించారు. ఈ అంశాన్ని ఐక్యరాజ్యసమితి గ్లోబల్ లాస్ అండ్ డ్యామేజ్ ఫండ్ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు... రానున్న ఐరాస సర్వసభ్య సమావేశంలో ఈ అంశాన్ని లేవనెత్తనున్నట్లు సమాచారం. దెబ్బతిన్న మౌలిక సదుపాయాలు, పునర్నిర్మాణానికి ప్రాథమికంగా 4 నుంచి 5 బిలియన్ డాలర్లు అవసరమవుతాయని అంచనా వేస్తున్నారు.

## తమిళనాడు ఆలయాల్లో స్మార్ట్‌ఫోన్లపై నిషేధం




మొదటిపేజీ తరువాయి - శాఖ పరిధిలోని 52 ముఖ్యమైన ఆలయాల్లో స్మార్ట్‌ఫోన్లపై నిషేధం విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కొత్త నిబంధనలు సెప్టెంబర్ 1 నుంచి అమల్లోకి వచ్చాయి. ఆలయాల్లో పవిత్రతను కాపాడటం, ప్రశాంతమైన వాతావరణాన్ని కొనసాగించడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.ఈ నిబంధనల ప్రకారం, భక్తులు ఆలయంలోకి ప్రవేశించే ముందు తమ స్మార్ట్‌ఫోన్‌లను తప్పనిసరిగా ప్రవేశ ద్వారం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో డిపాజిట్ చేయాలి. ఇందుకు రుసుముగా ప్రతి ఫోన్‌కు రూ.5 వసూలు చేస్తారు. ఫోన్ డిపాజిట్ చేశాక, దాన్ని తిరిగి తీసుకునేందుకు భక్తులకు ఒక టోకెన్ లేదా రశీదు ఇస్తారు. కొన్ని ఆలయాల్లో భక్తుడి ఫోటో, ఫోన్ మోడల్ వంటి వివరాలు నమోదు చేసుకుంటున్నారు. అయితే, కెమెరా సౌకర్యం లేని సాధారణ మొబైల్ ఫోన్లను లోపలికి తీసుకెళ్లేందుకు అనుమతి ఉంది.ఆలయాల్లో ఫోటోలు, వీడియోలు, సెల్ఫీలు, సోషల్ మీడియా రీల్స్ తీయడం వంటివి పెరిగిపోవడంతో మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. తిరువణ్ణామలైలోని అరుణాచలేశ్వర ఆలయం, కంచిలోని దేవరాజస్వామి ఆలయం, శ్రీరంగం వంటి ప్రముఖ క్షేత్రాల్లో ఇప్పటికే ఫోన్ డిపాజిట్ కౌంటర్లను ఏర్పాటు చేశారు. భక్తుల ఫోన్ల భద్రతకు లాకర్లు, సిబ్బంది, సీసీటీవీ నిఘా వంటి అన్ని ఏర్పాట్లు చేశామని హెచ్‌ఆర్‌సీఈ మంత్రి రమేశ్ తెలిపారు.ప్రభుత్వ నిర్ణయంపై భక్తుల నుంచి మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. ఆలయాల్లో ఏకాగ్రతకు, భక్తికి ఇది దోహదపడుతుందని చాలామంది స్వాగతిస్తుండగా, కౌంటర్ల వద్ద క్యూ లైన్లు, ఫోన్ల భద్రతపై కొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర సమయాల్లో ఇబ్బంది కలుగుతుందని మరికొందరు అభిప్రాయపడుతున్నారు. కాగా, పళని, మధురై, తిరుచెందూర్ వంటి కొన్ని ఆలయాల్లో ఈ నిబంధన ముందు నుంచే అమల్లో ఉంది. ఇప్పుడు దాన్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన ఆలయాలకు విస్తరించారు.

## రాజకీయాల్లో యువతకు ప్రత్యేక స్థానం కల్పించాలనే 'జై కొట్టు' యువజన విభాగం

మొదటిపేజీ తరువాయి - ఎంతో ముఖ్యమని సూచించారు. అధినేత ఆదేశాలను జనసైనికులు క్రమశిక్షణతో పాటించాలి అని నాదెండ్ల మనోహర్ తెలిపారు.'జనసేన పార్టీకి బలం యువత, కార్యకర్తలు. మీరు చేసిన కృషి, మీరు మోసిన జెండా, మీరు నిలబడిన తీరు, అంకితభావంతో పవన్ కల్యాణ్ కోసం, జనసేన పార్టీకోసం మనస్ఫూర్తిగా పని చేసిన మీ ఆలోచనే మనల్ని ఇంత దూరం తీసుకొచ్చింది. మీరే జనసేన పార్టీకి వనరులు. మీ ద్వారానే పార్టీ యంత్రాగాన్ని ముందుకు నెట్టుకుంటూ వచ్చాం. ఏ కార్యక్రమం చేసినా మీరే ఉన్నారు. ఎన్ని ఇబ్బందులు, అవరోధాలు ఎదురైనా మీరు పార్టీకోసం, నాయకుడి కోసం నిలబడ్డారు. పవన్ కల్యాణ్ మిమ్మల్ని అర్థం చేసుకున్నారు. ఆయనలోనూ, పార్టీలోనూ ఒకటే ఆలోచన ఉంది. మీ ఆంక్షలు, జనసేనను మీరు ఎలా ఎదగాలనుకున్నారో అది నెరవేర్చడానికే ఈ కార్యక్రమం. ఒక నియంత వైఎస్సార్సీపీ పార్టీని ఎదుర్కొని కూటమి కోసం అహర్నిషలు కృషి చేసింది మన జనసేన. ఈ రోజున యువజన విభాగం ఏర్పాటు చేసుకుంటున్నాం. మీలో స్ఫూర్తి నింపడానికే దీనికి 'జై కొట్టు' నామకరణం చేశామన్న జనసేన పీఏసీ చైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్.పిఠాపురంలో వేలాది బైకులతో నిర్వహించిన భారీ ర్యాలీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జనసేన జెండాలతో పిఠాపురం కాషాయమయం కాగా 'జై జనసేన', 'జై పవన్ కల్యాణ్' నినాదాలతో పట్టణం మారుమోగింది. ఇదే వేదికగా జనసేన అధినేత, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంత్రి నాదెండ్ల మనోహర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పవన్ కల్యాణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, కాకినాడ జిల్లా జనసేన అధ్యక్షుడు తుమ్మల రామస్వామి, కళ్యాణం శివ శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, తోట సుధీర్, తలాటం సత్య తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ 17వ వర్ధంతి.. ఇడుపులపాయలో జగన్ నివాళి

మొదటిపేజీ తరువాయి - వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన వైఎస్ రాజశేఖరరెడ్డి, 2009 సెప్టెంబర్ 2న 'రచ్చబండ' కార్యక్రమానికి వెళ్తూ నల్లమల అటవీ ప్రాంతంలో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. ఆయన ప్రవేశపెట్టిన ఆరోగ్య శ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతులకు ఉచిత విద్యుత్ వంటి పథకాలతో ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. ఆయన మరణించి 17 ఏళ్లు గడుస్తున్నా, ప్రజలు ఆయన్ను నేటికీ స్మరించుకుంటూనే ఉన్నారు.

## సిక్కింలో 40 ప్రమాదకర సరస్సులు గుర్తింపు



మొదటిపేజీ తరువాయి - పొరుగు దేశం నేపాల్‌లో హిమ సరస్సుల ఆకస్మిక ఉప్పెన (గ్లేసియల్ లేక్ ఔట్‌బరస్ట్ ఫ్లడ్) సృష్టించిన పెను విషాదం నేపథ్యంలో సిక్కిం రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. రాష్ట్రంలో ప్రమాదకరంగా మారే అవకాశం ఉన్న 40 హిమ సరస్సులను జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం గుర్తించింది. వీటిలో ఏడు సరస్సులను 'అత్యంత ప్రమాదకర' జాబితాలో చేర్చారు. దీంతో అప్రమత్తమైన అధికార యంత్రాంగం హైఅలర్ట్ ప్రకటించి, ముందస్తు నివారణ చర్యలపై దృష్టి సారించింది.ఈ ప్రమాదకర సరస్సులలో కొన్ని సముద్ర మట్టానికి సుమారు 17,000 అడుగుల ఎత్తులో ఉన్నాయి. వీటిలో ఏ ఒక్కటి గట్టు తెంచుకున్నా భారీ విపత్తు సంభవించే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ తాంబే మాట్లాడుతూ, కొన్ని సరస్సులపై ఇప్పటికే శాస్త్రీయ అధ్యయనం ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సరస్సుల లోతు, నీటి నిల్వ సామర్థ్యం, మంచు కురిసే విధానం, కొండచరియలు విరిగిపడే ముప్పు వంటి అంశాలను నిపుణులు అంచనా వేస్తున్నారని ఆయన వివరించారు.ఆగస్టు 26న నేపాల్‌లో హిమ సరస్సు విచ్ఛిన్నం కావడం వల్ల సంభవించిన వరదల్లో ఇప్పటికే 1,100 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, దాదాపు 4,000 మంది గల్లంతయ్యారు. ఈ నేపథ్యంలో సిక్కింలో అటువంటి విపత్తు పునరావృతం కాకుండా ఉండేందుకు ప్రభుత్వం పటిష్ఠమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటోంది.

## రక్షణ ఎక్స్‌పోకు రండి - అనుమతులు ఇప్పించండి



మొదటిపేజీ తరువాయి - రక్షణమంత్రి హాజరై వారికి మార్గనిర్దేశం చేస్తే ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉంటుందని తెలిపారు.రక్షణ ఎక్స్‌పో-2026ను అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్వహించేందుకు సహకరించాలని రాజ్‌నాథ్‌సింగ్‌కు రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఎయిర్‌షో నిర్వహణకు అవసరమైన గగనతల అనుమతులు ఇవ్వాలన్నారు. భారత వైమానిక దళానికి చెందిన విమానాలు, సూర్యకిరణ్, సారంగ్ ఏరోబాటిక్ బృందాలు ప్రదర్శనలో పాల్గొనేలా సహకరించాలని కోరారు. స్టాటిక్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రదర్శనకు కూడా సహకరించాలన్నారు. భూ, నౌకా, వైమానిక దళాలకు చెందిన అత్యాధునిక రక్షణ వ్యవస్థలను ప్రదర్శనలో ఏర్పాటు చేయాలని, త్రివిధ దళాల ఉన్నతాధికారులు, ప్రతినిధులు భాగస్వామ్యులు కావాలని సీఎం విజ్ఞప్తి చేశారు. హెచ్‌ఏఎల్, బీఈఎల్, బీడీఎల్, ఎండీఎల్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలు, డీఆర్‌డీవో ప్రయోగశాలలు రక్షణ ఎక్స్‌పోలో విస్తృతంగా పాల్గొని స్వదేశీ రక్షణ సాంకేతికతను ప్రదర్శించాలని కేంద్రమంత్రిని సీఎం కోరారు.ఆదిలాబాద్ విమానాశ్రయానికి సంబంధించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 750 ఎకరాలు భూ సేకరణ చేపట్టిందని రాజ్‌నాథ్ సింగ్‌కు రేవంత్‌రెడ్డి వివరించారు. రక్షణ శాఖ 1500 ఎకరాలు కోరినందున మరో 750 ఎకరాలు సేకరించి ఇచ్చేందుకు సిద్ధమని తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలో రక్షణ పరిశోధన, అభివృద్ధి ప్రయోగశాల (డీఆర్‌డీఎల్) ఆధ్వర్యంలో చేపట్టనున్న ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు 416.18 ఎకరాల భూమిని కేటాయించేందుకు ఇప్పటికే టీజీఐఐసీ అంగీకరించిందన్నారు. ఎకరానికి కాకుండా మొత్తం భూమికి సంవత్సరానికి కేవలం ఒక్క రూపాయి నామమాత్రపు లీజు అద్దెతో 33 సంవత్సరాల కాలానికి భూమిని కేటాయించనున్నట్లు తెలిపారు. అవసరమైతే దానిని మరో రెండుసార్లు లీజు పొడిగించుకునే అవకాశం ఉందని సీఎం చెప్పారు.

## నేను చెప్పాల్సినవన్నీ చెప్పా, అధిష్ఠానం నిర్ణయం కోసం వేచి చూస్తున్నా



మొదటిపేజీ తరువాయి - మీడియాతో మాట్లాడిన కొండా సురేఖ ఈ వ్యాఖ్యలు చేశారు. తన కుమార్తె వ్యాఖ్యలతో తనకు సంబంధం లేదని అధిష్ఠానానికి చెప్పినట్లు వివరించారు. సుస్మితకు వివాహం అయిందని, ఆమె ఇండిపెండెంట్‌గా ఉందన్నారు.కాంగ్రెస్ హైకమాండ్‌కు తాను చెప్పాల్సినదంతా చెప్పానని మంత్రి కొండా సురేఖ వివరించారు. పార్టీ పెద్దలు ఆలోచిస్తామని చెప్పారన్నారు. తన బిడ్డ స్వతంత్రంగా ఉందని వివరించారు. పెళ్లి చేసుకుని ఆ ఇంటి కోడలిగా మాట్లాడిందని అనుకుంటున్నానన్నారు. ఆమె జీవితం ఆమె ఇష్టమని సురేఖ పేర్కొన్నారు. తనతో పాటు తన భర్త రాజకీయ జీవితం మా ఇష్టం అని తెలిపారు. తాను మంత్రిగా మంచి పనితీరు కనబరుస్తున్నానని కొండా సురేఖ చెప్పారు. అవినీతి ఆరోపణలు లేకుండా పనిచేస్తున్నానని వివరించారు. ప్రజలకు సేవ చేయాలనే ఆలోచనతో ఉన్నానని తెలిపారు. పదవిలో కొనసాగించాలని అధిష్ఠానాన్ని కోరానని ఆమె వివరించారు."కాంగ్రెస్ అధిష్ఠానానికి నేను చెప్పుకోవాల్సిందంతా చెప్పాను. పార్టీ పెద్దలు ఆలోచిస్తామని చెప్పారు. నా బిడ్డ స్వతంత్రంగా ఉంది. పెళ్లి చేసుకుని ఆ ఇంటి కోడలిగా మాట్లాడిందని అనుకుంటున్నాను. ఆమె జీవితం ఆమె ఇష్టం. నాతో పాటు నా భర్త రాజకీయ జీవితం మా ఇష్టం. నేను మంత్రిగా మంచి పనితీరు కనబరుస్తున్నాను. అవినీతి ఆరోపణలు లేకుండా పనిచేస్తున్నా. ప్రజలకు సేవ చేయాలనే ఆలోచనతో ఉన్నాను. పదవిలో కొనసాగించాలని అధిష్ఠానాన్ని కోరాను.తన కుమార్తె వ్యాఖ్యలపై తాను స్పందించనని కొండా సురేఖ తెలిపారు. సుస్మిత వ్యాఖ్యలతో తమకు సంబంధం లేదన్నారు. రోజూ ఎంతో మంది మాట్లాడతారని అందులో సుస్మిత కూడా ఒకరని కొండా సురేఖ అన్నారు. తన బిడ్డ కనుక తనను బాధ్యురాలిని చేయడం సరికాదని ఆమె వివరించారు. ఆమె వ్యాఖ్యలను ఖండించడం, సమర్థించడం చేయనన్నారు. తన వివరణను మీనాక్షి నటరాజన్‌కు చెప్పానట్లు వెల్లడించారు. అధిష్ఠానానికి ఆమె చెప్తానన్నారని సురేఖ వివరించారు.పార్టీలో కొంతమందితో తనపై ఆరోపణలు చేయించారన్నారు. ఎవరు అలా చేయించారో తనకు తెలుసని కొండా సురేఖ పేర్కొన్నారు. పేర్లు చెబితే వివాదం అవుతుందన్నారు. తనపై ఆరోపణలు చేసిన వారికీ షోకాజ్ నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకోవాల్సిన అవసరముందని సురేఖ అభిప్రాయపడ్డారు. పార్టీ ఆ దిశగానూ ఆలోచించాలని ఆమె కోరారు. తనకు షోకాజ్ నోటీసు ఇవ్వడమే అసలు తప్పు అని అన్నారు. ఏఐసీసీ సభ్యురాలిగా ఉన్నానని అందుకే ఇక్కడికి వచ్చి తన బాధ చెప్పుకొన్నానన్నారు. రాహుల్, ప్రియాంక, కేసీ వేణుగోపాల్‌కు రాతపూర్వకంగా వివరణ ఇచ్చామన్న ఆమె, పార్టీ తీసుకునే నిర్ణయం ఆధారంగా తన ఆలోచన ఉంటుందని కొండా సురేఖ అన్నారు."నేను చెప్పాల్సినవన్నీ పార్టీ పెద్దలకు చెప్పాను. నాకు షోకాజ్ నోటీసు ఇవ్వడమే తప్పు. నా వివరణ అంతా కేసీ వేణుగోపాల్‌కు వాట్సప్ చేశాను. పార్టీ ఏం నిర్ణయం తీసుకుంటుందనేది నాకు తెలియదు. నా కుమార్తె వ్యాఖ్యల గురించి ఏమీ మాట్లాడను. సుస్మిత వ్యాఖ్యలను ఖండించటం, సమర్థించటం చేయను. ఇండిపెండెంట్ మహిళ మాట్లాడవద్దని చెప్పే హక్కు నాకు లేదు. నా కుమార్తె వ్యాఖ్యలకు నన్ను బాధ్యురాలిని చేయటం సరికాదన్న మంత్రి కొండా సురేఖ.ఇటీవల గీసుకొండలో సీఎం రేవంత్ రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. కుమార్తె వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలని కొండా సురేఖకు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ నోటీసులు ఇచ్చింది. క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవికి కొండా సురేఖ వివరణ ఇచ్చారు. అనంతరం కొండా సురేఖతో పాటు వనపర్తి వ్యవహారంలో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిపై రూపొందించిన నివేదికను కాంగ్రెస్ హైకమాండ్‌కు టీపీసీసీ పంపింది. ఈ పరిణామాల నేపథ్యంలో మంత్రి దిల్లీకి వెళ్లారు. కొండా సురేఖ విషయంలో అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోననే ఉత్కంఠ నెలకొంది.మంత్రి కొండా సురేఖను పదవి నుంచి తొలగించాలని ఏఐసీసీకీ పీసీసీ క్రమశిక్షణ కమిటీ సిఫార్సు చేసినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఇప్పటికే ప్రాథమిక నివేదిక ఇచ్చిన పీసీసీ క్రమశిక్షణ కమిటీ పూర్తి స్థాయి రిపోర్ట్‌ను పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌కు అందించింది. పార్టీ గీతను దాటి వ్యవహరించిన నేతలపై చర్యలు తీసుకోవాలని నివేదికలో పేర్కొన్నట్లు క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి కొద్దిరోజుల క్రితం వివరించారు. ఈ నివేదికపైనే ఏఐసీసీ పెద్దలు ముఖ్యమంత్రి, పీసీసీ చీఫ్, ఇతర కీలక నేతలతో చర్చించింది.

## వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలన ప్రజా రంజకం




మొదటిపేజీ తరువాయి - కష్టాలను తీర్చడానికే నిరంతరం కృషి చేశామని అన్నారు. రాష్ట్రంలో తీవ్ర ఆర్థిక సంక్షోభం, గత ప్రభుత్వ అప్పుల భారం ఉన్నప్పటికీ, ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని ఆపకుండా ప్రజల అవసరాలకు అనుగుణంగా పాలన కొనసాగిస్తున్నామని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలపై మంత్రి పొంగులేటి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గతంలో కేసీఆర్ 'వరి వేస్తే ఉరే' అన్నారని, కానీ తమ ప్రభుత్వం రాగానే వరి సాగుకు మద్దతుగా రూ.500 బోనస్ అందిస్తూ, వరి ఉత్పత్తిలో తెలంగాణను దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిపామని గుర్తుచేశారు. రైతు సంక్షేమానికై ఇప్పటికే రూ.1.76 లక్షల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో గ్రూప్-1 ప్రశ్నాపత్రాలను అమ్ముకున్నారని ఆరోపించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన రూ.8.21 లక్షల కోట్లకు పైగా అప్పులు, నిలిచిపోయిన బకాయిలు, సర్పంచ్‌ల బకాయిలతో పాటు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ నిధులను కూడా తమ ప్రభుత్వమే చెల్లిస్తోందని పేర్కొన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో పేదలకు రేషన్ కార్డులు కూడా ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండేళ్లలోనే కొత్తగా 15 లక్షల రేషన్ కార్డులు మంజూరు చేసిందని తెలిపారు. అతి త్వరలోనే మరో 3 లక్షల మందికి కొత్తగా వితంతు, వృద్ధాప్య పింఛన్లు అందజేయబోతున్నామని ప్రకటించారు.కేటీఆర్ హద్దులు మీరి, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఉద్దేశించి సంస్కారహీనంగా మాట్లాడితే ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ క్షమించరని హెచ్చరించారు. బీఆర్ఎస్ నేతలు ధరణి పేరుతో కొల్లగొట్టిన భూములు, ఆస్తులపై విచారణ జరుగుతోందని, 22ఏ భూములపై అసెంబ్లీలో చర్చకు రావాలని సవాల్ విసిరారు. నిజమైన ప్రతిపక్ష హోదాకు కేసీఆర్ పూర్తిగా అనర్హుడని విమర్శించారు.

## ఘనంగా మొదటి రోజు గీత యజ్ఞము కార్యక్రమం




**సూర్య ఉదయం ఎమ్మిగనూరు :** ఎమ్మిగనూరు పట్టణంలో గీతా మందిరము స్వస్తిశ్రీ పరభానామ శ్రావణమాసం సందర్భంగా శ్రీ శ్రీ అవ్యకానంద సరస్వతి స్వాములు లోక కళ్యాణార్థానముకై ఈ ఈరోజు ఘనంగా పూజ కార్యక్రమం నిర్వహించి ప్రారంభించారు గీతా యజ్ఞం ఈనెల 19 వరకు గీత యజ్ఞము జరుగను. . ఈ సందర్భంగా గీతా మందిర్ ఆలయ కమిటీ ప్రెసిడెంట్ ఏం లక్ష్మన్న కార్యదర్శి ఏం ఊరుకుందప్ప మాట్లాడుతూ గీతా యజ్ఞము ఉదయం గంట 7-30 నుండి 10-30 వరకు

**గీతాప్రసంగములు :** సాయంత్రం 6-30 నుండి రాత్రి 8 గంటల వరకుఉంటాయి ఈ యజ్ఞం ద్వారా వర్షాలు సకల కోటి జీవరాసులకు మంచి జరుగుతాయని నమ్మకంతో గీత యజ్ఞాన్ని నిర్వహిస్తున్నాం అలాగే 4 వ తేదీ శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఉదయం 10. గంటలకు అలాగే ఉట్ట కొట్టే కార్యక్రమం శ్రీకృష్ణ ఉత్సాహ విగ్రహం వ్రతంపై అలంకరించి బాజా భజంత్రీలు కోలాటంలతో ఘనంగా ఊరేగింపు అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు కార్యక్రమంలో కోశాధికారి కే నాగేష్ అర్చకులు విష్ణువర్ధన్ శర్మ బి రఘురాం తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు.సేవా కార్యక్రమం




**సూర్య ఉదయం ఎమ్మిగనూరు :** ఉప ముఖ్యమంత్రి,జనసేన అధినేత పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నియోజకవర్గం లో ముగితి రోడ్డు ఉన్న అనాధ ఆశ్రమంలో జనసేన నియోజకవర్గ నాయకులు సప్పోగు భాస్కర్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు సపోగు భాస్కర్ మాట్లాడుతూ, అనాథాశ్రమంలోని చిన్నారులతో జనసేన నాయకులు తో కలిసి కేక్ కటింగ్ చేసి అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించడం జరిగింది చిన్నారులతో కలిసి భోజనం చేసిన జనసేన నాయకులు, సప్పోగు భాస్కర్ పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు.ఈ కార్యక్రమం లో గణేష్ ప్రభాకర్ హరికృష్ణ జయరాం మల్లి రాజు నరసన్న నవాబ్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎలక్షన్లో జనసేన పార్టీ జెండా ఎగరవేస్తాం

### మంత్రాలయంలో ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదినం వేడుకలు





**వాల్మీకి లక్ష్మణ. సెప్టెంబర్ 2.(సూర్య ఉదయం ప్రతినిధి మంత్రాలయం :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ జన్మదినం వేడుకలు మంత్రాలయం నియోజకవర్గంలో బుధవారం ఘనంగా జరిగాయి. మంత్రాలయం జనసేన పార్టీ ఇంచార్జ్ వాల్మీకి బి. లక్ష్మన్న నేతృత్వంలో ఈ కార్యక్రమాలు జరిగాయి.కౌతాళం గ్రామంలో వందలాది బైక్లతో భారీ ర్యాలీ నిర్వహించి ఎంపీడీవో కార్యాలయం వరకు చేరుకున్నారు. అనంతరం ఎస్. రామాంజనేయులు అధ్యక్షతన, ఎస్. చిన్న నిర్వహణలో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ జన్మదిన శు భాకాంక్షలు కేక్ కట్ చేసి, నియోజకవర్గంలోని నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలను ఘనంగా సన్మానించారు.పవన్ కళ్యాణ్ కృషితోనే రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడిందని, ఆయన పర్యవేక్షణలో పంచాయతీరాజ్ శాఖ ద్వారా గ్రామాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని వాల్మీకి లక్ష్మన్న పేర్కొన్నారు.?రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన అభ్యర్థులు పెద్ద ఎత్తున పోటీ చేసి గెలవాలని, పార్టీ అందరికీ అండగా ఉంటుందని పిలుపునిచ్చారు. జనసేన పార్టీ యువజన విభాగం ఆవిర్భావం పట్ల ఈ సందర్భంగా నాయకులు హర్షం వ్యక్తం చేశారు.?ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు బి.వి. రవిచంద్ర, లోకేష్, కౌతాళం రాంబాబు, బిబిసి చిన్న, రాంప్రసాద్, ఎర్రి స్వామి, తిక్కయ్య, నరసింహులు, ఉదయ్ ఆచారి, రంగనాథ్, ఆకాష్, సిద్దేశ్, ప్రకాష్, చంద్ర, మల్లికార్జున, అంజి తదితరులతో పాటు నాలుగు మండలాల కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సైబరాబాద్ పోలీస్ సిబ్బంది బదిలీలను తాత్కాలికంగా వాయిదా వేయాలని విజ్ఞప్తి



**సూర్య ఉదయం ప్రతినిధి, సైబరాబాద్:** విద్యా సంవత్సరం మధ్యలో ఉన్న నేపథ్యంలో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్లో పోలీస్ సిబ్బంది బదిలీలను తాత్కాలికంగా వాయిదా వేయాలని సైబరాబాద్ పోలీస్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మేనేజింగ్ కమిటీ సభ్యులు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్, ఐపీఎస్ను కలిసి వినతిపత్రం అందజేశారు. పిల్లల స్కూల్ ఫీజులు, అడ్మిషన్లు ఇప్పటికే పూర్తయిన నేపథ్యంలో ప్రస్తుతం బదిలీలు చేపడితే పోలీస్ సిబ్బంది ఆర్థికంగా, కుటుంబపరంగా, అలాగే పిల్లల విద్యాపరంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని కమిటీ సభ్యులు కమిషనర్కు వివరించారు. అలాగే త్వరలో జరగనున్న గణేష్ ఉత్సవాల సందర్భంగా చేపట్టాల్సిన బందోబస్తు విధులను సమర్థవంతంగా నిర్వహించేందుకు కూడా ప్రస్తుతం సిబ్బంది బదిలీలను నిలిపివేయడం అవసరమని వారు కోరారు. ఈ విజ్ఞప్తిపై సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్, ఐపీఎస్ సానుకూలంగా స్పందిస్తూ, మేనేజింగ్ కమిటీ సభ్యుల విజ్ఞప్తిని సానుభూతితో పరిశీలిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా డీసీపీ (అడ్మిన్) టి. అన్నపూర్ణ ఐపీఎస్, సొసైటీ ట్రెజరర్ జి. మల్లేశం ఎస్ఐ, డైరెక్టర్లు ఎ. రాజేందర్,శ్రీ పీసీ, బి. బలవంత్ రెడ్డి హెచ్సీ, సి. మల్లేశం హెచ్సీ, పి. అశోక్ ఏఆర్పీసీ, జె. రాజిని ఏఆర్డబ్ల్యూపీసీ, డి. పద్మలత తదితరులు పాల్గొన్నారు.

## కోసిగి టిడిపి మాజీ ఎంపీపీ శకుంతలమ్మ కన్నుమూత



**సెప్టెంబర్ 2( సూర్య ఉదయం ప్రతినిధి మంత్రాలయం) :** కోసిగి మండల టిడిపి మాజీ ఎంపీపీ పైఇంటి శకుంతలమ్మ (55) బుధవారం మధ్యాహ్నం 1: గంటకు హైదరాబాద్లో కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె, కుమారుడి వద్ద హైదరాబాద్లో నివాసం ఉంటున్నారు. పరిస్థితి క్షీణించడంతో గత వారం రోజులుగా అక్కడి ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. భౌతిక కాయానికి అంత్యక్రియలు ఆమె స్వగ్రామమైన పల్లిపాడులో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె మృతి పట్ల పలువురు రాజకీయ నాయకులు, స్థానిక ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

# వై.ఎస్ ఆర్ కు ఘన నివాళులు

### - పార్టీలకు అతీతంగా పాల్గొన్న అభిమానులు, నాయకులు





**సూర్య ఉదయం ప్రతినిధి, కూకట్పల్లి:** దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతిని పురస్కరించుకొని కూకట్పల్లి కేపీహెచ్బీ 9వ ఫేజ్లో వై.ఎస్ ఆర్ అభిమానులు నివాళులర్పించారు. పార్టీలకు అతీతంగా పలువురు నాయకులు, అభిమానులు కార్యక్రమంలో పాల్గొన్నారు. కేపీహెచ్బీ వై.ఎస్ ఆర్ అభిమానులు బాషా, అరుణ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, లక్ష్మి రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆరే శ్యామల, వై.ఎస్.ఆర్.సి.పీ రాష్ట్ర ఐటీ వింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్యాల విజయ భాస్కర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కూకట్పల్లి స్థానిక నాయకులు బండి మధుసూదన్ రెడ్డి, శివ రెడ్డి, జి.ఎల్.ఎన్. రెడ్డి, తులసి రెడ్డి లు విశిష్ట అతిథులుగా పాల్గొని వై.ఎస్ ఆర్ చిత్రపటానికి పూలమాలలు సమర్పించారు. అనంతరం కొబ్బరికాయలు కొట్టి ఆయన సేవలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహానేత అని కొనియాడారు. పేదల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేసిన గొప్ప ప్రజానాయకుడిగా ఆయన సేవలను గుర్తుచేశారు. వైఎస్సార్ కేవలం రాజకీయ నాయకుడు మాత్రమే కాదని, ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావించిన గొప్ప మానవతావాది అని అన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, రైతుల సంక్షేమం, పేదలకు వైద్యం, విద్యను అందుబాటులోకి తీసుకురావడం వంటి అనేక రంగాల్లో వైఎస్సార్ తనదైన ముద్ర వేశారని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు ఆయన చేపట్టిన పాదయాత్ర ప్రజలతో ఆయనకున్న అనుబంధానికి నిదర్శనమని అన్నారు. ఎండ, వానలను లెక్కచేయకుండా ప్రజల మధ్య నడుస్తూ వారి కష్టసుఖాలను తెలుసుకున్నారని గుర్తుచేశారు. పాదయాత్రలో ప్రజల నుంచి తెలుసుకున్న సమస్యలు, వారి ఆశలు వైఎస్సార్ పాలనకు మార్గదర్శకంగా నిలిచాయని నాయకులు తెలిపారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని సమాజ అభివృద్ధి, ప్రజాసేవ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో క్రాంతి కుమార్, ఆది రెడ్డి, సునీల్ కుమార్, బుజ్జి, పాల్ తదితర వై.ఎస్ ఆర్ అభిమానులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## 420 హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ - ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు




**సూర్య ఉదయం ప్రతినిధి, కూకట్ పల్లి:** వంద రోజుల్లో అమలు చేస్తామని 420 బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, వెయ్యి రోజులు దాటినా ఏ ఒక్క ప్రధాన వాగ్దానాన్ని నెరవేర్చకుండా ప్రజలను తీవ్రంగా వంచించిందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మండిపడ్డారు. బుధవారం ఓల్డ్ బోయిన్పల్లి డివిజన్ పరిధిలో నిర్వహించిన పార్టీ సమావేశంలో మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్, స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పాల్గొని మాట్లాడారు. దమ్ము, ధైర్యం ఉంటే ఎవరు పనిచేశారో, ఎవరు చేయలేదో ప్రజల సమక్షంలోనే తేల్చుకుందామని కాంగ్రెస్ నాయకులకు ఆయన సవాల్ విసిరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజలకు కష్టాలు, తిప్పలు తప్పడం లేదని విమర్శించారు. రూ.4 వేల పింఛను, ఒంటరి మహిళలకు నెలకు రూ.2,500, ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలు, తులం బంగారం వంటి ఎన్నికల హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. గతంలో కేసీఆర్ పాలనలో కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, రూ.5 భోజనం, ఆడబిడ్డలకు బతుకమ్మ చీరలు వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేశామని గుర్తు చేశారు. అయితే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఆ సంక్షేమ కార్యక్రమాలను నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణమంటూ ప్రచారం చేసుకుంటూ, మరోవైపు వారి కుటుంబాలపై భారాలు మోపుతున్నారని మాధవరం కృష్ణారావు విమర్శించారు. గత మూడేళ్లలో ఒక్కో మహిళకు ప్రభుత్వం రూ.72 వేల వరకు బాకీ పడిందని, ప్రతి కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వం సుమారు రూ.5 లక్షలు బాకీ ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ వివరాలతో కూడిన 'బాకీ కార్డు'ను ప్రతి ఇంటికీ తీసుకెళ్లనున్నట్లు స్పష్టం చేశారు. తమ హయాంలో బోయిన్పల్లి అభివృద్ధికి రూ.150 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. రూ.100 కోట్లతో తాగునీటి వ్యవస్థను పటిష్టం చేసి ప్రజలకు 20 వేల లీటర్ల వరకు ఉచిత నీరు అందించామని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రజలకు నీటి బిల్లులు పంపుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో రూ.44 లక్షలతో అంబులెన్సులను సమకూర్చితే, వాటిపై ఉన్న తన ఫోటోలను తొలగించడం కాంగ్రెస్ చిల్లర రాజకీయాలకు నిదర్శనమని ధ్వజమెత్తారు. బోయిన్పల్లిలో మెజారిటీ స్థలాలను 22ఏ పరిధిలోకి తీసుకువచ్చి స్థానిక ప్రజలను, పేదలను కబ్జాదారులుగా చిత్రీకరించే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ఇందిరమ్మ ఇళ్ల పేరుతో కాంగ్రెస్ నాయకులు చేస్తున్న మోసాలను ఆధారాలతో సహా ప్రజల ముందుకు తీసుకువస్తామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే కలెక్టరేట్, మున్సిపల్ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని, ప్రజలే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బోయిన్పల్లి మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్, హరినాథ్, ఇర్ఫాన్, మక్కాల నర్సింగ్ రావు, నరేందర్ గౌడ్, ఎజాస్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# వైఎస్సార్ వర్ధంతి ఫ్లెక్సీ చించివేతపై అభిమానుల ఆగ్రహం



**సూర్య ఉదయం ప్రతినిధి, కూకట్పల్లి:** దివంగత ముఖ్యమంత్రి కీ.శే. డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి 17వ వర్ధంతిని పురస్కరించుకొని కూకట్పల్లి రమ్య మైదానం ఎదుట వైఎస్సార్ అభిమానులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని గుర్తుతెలియని వ్యక్తులు గత రాత్రి కావాలనే చించి వేసిన ఘటన స్థానికంగా ఉద్రిక్తతకు దారితీసింది. ఈ ఘటనపై వైఎస్సార్ అభిమానులు తీవ్ర ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసనకు దిగారు. ఫ్లెక్సీని చించిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని నిందితులను గుర్తించి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో అభిమానులు ధర్నాను విరమించారు. అనంతరం కేపీహెచ్బీ పోలీస్ స్టేషన్ సీఐ విజయ్ కుమార్కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు.ఫిర్యాదుపై పోలీసులు తక్షణమే స్పందించడం పట్ల వైఎస్సార్ అభిమానులు హర్షం వ్యక్తం చేశారు. అయితే, రాజకీయ నాయకులు లేదా అభిమానులు ఏర్పాటు చేసే ఫ్లెక్సీలను చించివేయడం వంటి చర్యలు ఎంతమాత్రం హర్షించదగినవి కావని వారు పేర్కొన్నారు. కూకట్పల్లి ప్రాంతానికి ఉభయ తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో ప్రత్యేక ప్రాధాన్యత ఉందని, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, అభిమానులు ఇక్కడ తరచూ కార్యక్రమాలు నిర్వహిస్తుంటారని తెలిపారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఇలాంటి ఘటన జరగడం హేయమైన చర్యగా వారు అభివర్ణించారు. ఇలాంటి సంస్కృతి ప్రారంభమైతే భవిష్యత్తులో పరిస్థితులు మరింత ఇబ్బందికరంగా మారే అవకాశం ఉందని, దీనిని ప్రారంభ దశలోనే అరికట్టాల్సిన బాధ్యత అన్ని రాజకీయ పార్టీల నాయకులపై ఉందని వైఎస్సార్ అభిమానులు పేర్కొన్నారు. ఎవరి అభిమాన పార్టీలు వారికి ఉన్నప్పటికీ, అందరూ కలిసిమెలిసి ఉండే ప్రాంతం కేపీహెచ్బీ అని తెలిపారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా అన్ని రాజకీయ పార్టీలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. రాజకీయ, సామాజిక కార్యక్రమాలు ప్రశాంతంగా, ఆహ్లాదకరమైన వాతావరణంలో జరిగేలా ఆయా పార్టీల నాయకులు బాధ్యత వహించాలని సూచించారు. ఇటువంటి ఆకతాయిల చర్యలు జరగకుండా పోలీసు అధికారులు కూడా కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ అభిమానులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బండి మధుసూదన్ రెడ్డి, శివారెడ్డి, జీఎల్ఎన్ రెడ్డి, గాలి రెడ్డి, తులసి రెడ్డి, కోటేశ్వరరావు, సత్యనారాయణ, సాయినాథ్ రెడ్డి, శేషు, ఆది, వెంకట్రాంరెడ్డి తదితర కూకట్పల్లి వైఎస్సార్ అభిమానులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

## .నీట్లో మెరిసిన కోసిగి ఆణిముత్యాలు - ఒకే గ్రామం నుంచి 7గురు విద్యార్థులకు మెడిసిన్ సీట్లు!



**సెప్టెంబర్ 2 (సూర్య ఉదయం ప్రతినిధి మంత్రాలయం) :** అక్షరాస్యతలో వెనుకబడిన ప్రాంతంగా, పెళ్లిళ్లే శరణ్యమనే భావన ఉన్న మారుమూల కోసిగి మండలంలో బాలికలు చరిత్ర సృష్టించారు. "మేమేమీ తక్కువ కాదంటూ" కష్టపడి చదివి,(చీజులు) ప్రవేశ పరీక్షలో అద్భుత ప్రతిభ కనబరిచి ఏకంగా 5గురు విద్యార్థినిలు మెడిసిన్ సీట్లు కైవసం చేసుకున్నారు. అలాగే వీరితోపాటు మరో ఇద్దరు యువకులు మెడిసిన్ సీట్లు సాధించారు. బుధవారం కేంద్ర ప్రభుత్వం నీట్ ఫలితాలు విడుదల చేయగా, ఈ గ్రామీణ ప్రతిభ వెలుగులోకి వచ్చింది.

**ఎంబీబీఎస్ సీట్లు సాధించిన విజేతలు:** వగ్గా అక్షయ: కొత్తపేట కాలనీకి చెందిన వగ్గా చంద్రశేఖర్, పవిత్ర దంపతుల కుమార్తె. ఈమె నంద్యాలలోని శాంతిరామ్ మెడికల్ కళాశాలలో సీటు సాధించారు.

**పింజారి రిజ్వానా:** సిద్ధప్ప పాళెం నివాసి పింజారి ఉమర్ కుమార్తె. ఈమె కూడా నంద్యాల శాంతిరామ్ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు పొందారు.

**కె. మమత :** కోసిగి హిందూ బాలికల పాఠశాల హెచ్ఎం కె. సంజన్న, పెద్దక్క దంపతుల కుమార్తె. ఈమె నంద్యాల శాంతిరామ్ మెడికల్ కళాశాలలో సీటు కైవసం చేసుకున్నారు.

**గోరంట్ల పూజిత :** పెద్ద మసీదు సమీపంలో నివాసముంటున్న గోరంట్ల రామాంజినేయులు, సునీత దంపతుల కుమార్తె. ఈమె కర్నూలులోని విశ్వభారతి మెడికల్ కళాశాలలో సీటు సాధించారు.

**కె. ముంతాజ్ :** ముస్లిం మైనార్టీ కాలనీకి చెందిన ఉసేన్ సాబ్, ఫాతిమా దంపతుల కుమార్తె. ఈమె వైఎస్సార్ కడప జిల్లాలోని ఫాతిమా మెడికల్ కళాశాలలో మెడిసిన్ సీటు కైవసం చేసుకున్నారు...వీరితోపాటు కోసిగికి చెందిన మరో ఇద్దరు యువకులు వెనుకబడిన కోసిగి ప్రాంతం నుంచి ఒకేసారి 7గురు విద్యార్థినులు ఎంబీబీఎస్ సీట్లు సాధించడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు మరియు స్థానిక నాయకులు తీవ్ర హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ బాలికలకు వీరి విజయం ఎంతో స్ఫూర్తిదాయకమని పలువురు కొనియాడారు.

# కేపీహెచ్బీలో వై.ఎస్ ఆర్ ఫ్లెక్స్ వివాదం

### - ఫ్లెక్స్ చించివేశారంటూ అభిమానుల ఆందోళన..
### - నిందితులను అరెస్ట్ చేయాలని డిమాండ్





**సూర్య ఉదయం ప్రతినిధి, కూకట్పల్లి:** దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని కూకట్పల్లి కేపీహెచ్బీలో ఏర్పాటు చేసిన వై.ఎస్ ఆర్ ఫ్లెక్స్ను గుర్తుతెలియని వ్యక్తులు చించివేశారంటూ వై.ఎస్ ఆర్ అభిమానులు ఆందోళనకు దిగారు. ఫ్లెక్స్ చించివేసిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. విషయం తెలుసుకున్న వైఎస్సార్ అభిమానులు రమ్య గ్రౌండ్స్ వద్ద ధర్నా నిర్వహించారు. ఫ్లెక్స్ను చించివేసిన వారిని వెంటనే గుర్తించి అరెస్ట్ చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నాలో వైఎస్సార్ అభిమానులు బండి మధుసూదన్ రెడ్డి, శివ రెడ్డి, జి.ఎల్.ఎన్ రెడ్డి, తులసి రెడ్డితో పాటు స్థానిక అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న ఆంధ్రప్రదేశ్ వైఎస్సార్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆరే శ్యామల ధర్నా కార్యక్రమంలో పాల్గొని అభిమానులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్సార్ జిందాబాద్ అంటూ, ఫ్లెక్స్ చించిన వారిని అరెస్ట్ చేయాలంటూ నినాదాలు చేశారు. ఫ్లెక్స్ను చించిన వారిని ఎంతటి వారైనా, వారి వెనుక ఎంతటి పెద్ద నాయకులు ఉన్నా ఉపేక్షించకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అభిమానులు డిమాండ్ చేశారు. ఈ ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేదల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేసిన గొప్ప నాయకుడని అభిమానులు పేర్కొన్నారు. అలాంటి మహానేత వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్స్ను చించివేయడం తమను తీవ్రంగా కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనకు బాధ్యులైన వారిపై పోలీసులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

# మంత్రాలయం టిడిపిలో 'జిల్లా' చిచ్చు

## ఇన్‌ఛార్జ్‌కు తలనొప్పిగా మారిన నేతల చీకటి ఒప్పందాలు!




**సూర్య ఉదయం ప్రతినిధి (మంత్రాలయం) :** మంత్రాలయం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీలో అంతర్గత ఒప్పందాలు, జిల్లా నాయకుల తీరు తీవ్ర కలకలం రేపుతున్నాయి. పార్టీని బలోపేతం చేయాల్సిన కొందరు టిడిపి జిల్లా నాయకులే ప్రత్యర్థి వైసిపికి పరోక్షంగా మేలు చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా నేతలు కుదుర్చుకుంటున్న చీకటి ఒప్పందాలు, లోపాయికారీ రాజకీయం ఇప్పుడు మంత్రాలయం టిడిపి ఇన్‌ఛార్జ్‌కు పెద్ద తలనొప్పిగా మారాయి. ఇన్‌ఛార్జ్‌కు తలనొప్పి కమీషన్ల కోసం కొంతరనియోజకవర్గంలో స్థానిక శ్రేణులను ఏకం చేస్తూ పార్టీని ముందుకు తీసుకెళ్లేందుకు ఇన్‌ఛార్జ్ ప్రయత్నిస్తుంటే, జిల్లా స్థాయి నాయకులు మాత్రం సొంత లాభాల కోసం వైసిపి నాయకులతో 'క్రాస్ ఫైర్' (పరోక్ష రాజీ) ఒప్పందాలు చేసుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. పార్టీ ప్రయోజనాలను పక్కనబెట్టి, కేవలం కమీషన్ల కోసమే జిల్లా నేతలు ఆరాటపడుతూ వైసిపికి సహకరిస్తుండటం స్థానిక నాయకత్వానికి మింగుడుపడటం లేదు.

**ప్రభుత్వ సొమ్ముకు భారీ గండి**

కోట్లల్లో అక్రమార్జన ఈ రహస్య ఒప్పందాల కారణంగా నియోజకవర్గంలో ప్రభుత్వ ధనానికి భారీగా గండి పడుతోంది. వివిధ పనులు, అక్రమ పద్ధతులను ప్రోత్సహిస్తూ కోట్ల రూపాయల ప్రజాధనం నేరుగా వైసిపి నాయకుల జేబుల్లోకి వెళ్లేలా జిల్లా నేతలు చక్రం తిప్పుతున్నారని పార్టీ శ్రేణులు ఆరోపిస్తున్నాయి. కంటితుడుపు నిరసనలతో సరిపెడుతూ, లోపల మాత్రం అక్రమ సంపాదనలో భాగస్వాములవుతున్నారని మండిపడుతున్నారు. అధిష్ఠానం తక్షణమే జోక్యం చేసుకోవాలి సొంత ప్రయోజనాల కోసం పార్టీ భవిష్యత్తును తాకట్టు పెడుతూ, వైసిపి నాయకులతో చేతులు కలిపిన జిల్లా నేతలపై టిడిపి అధిష్ఠానం వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రాలయం నియోజకవర్గ కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు. ఇన్‌ఛార్జ్‌కు అండగా నిలిచి, పార్టీకి ద్రోహం చేస్తున్న నేతలకు కట్టడి చేయకపోతే తీవ్ర నష్టం తప్పదని హెచ్చరిస్తున్నారు.

# గూడూరు 4వ వార్డులో డంపింగ్ యార్డ్ ముప్పు

## రోగాల బారిన పడుతున్న పడమర బీసీ కాలనీ ప్రజలు!



**సూర్య ఉదయం, గూడూరు (సెప్టెంబర్ 02):**గూడూరు మున్సిపల్ పరిధిలోని 4వ వార్డు పడమర బీసీ కాలనీ (మునగాల రోడ్డు) నివాసితులు తీవ్ర నరకయాతన అనుభవిస్తున్నారు. కాలనీకి సరిగ్గా ఆనుకొని ఉన్న మున్సిపల్ డంపింగ్ యార్డ్ వల్ల తమ ఆరోగ్యం క్షీణిస్తోందని, నిత్యం రోగాల బారిన పడుతున్నామని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**కాలనీవాసులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు:**

దోమలు, దుర్గంధం: డంపింగ్ యార్డ్‌లో చెత్తతో పాటు జంతువుల కళేబరాలను వేస్తుండటంతో తీవ్రమైన దుర్గంధం వస్తోంది. దోమలు, ఈగలు విపరీతంగా పెరిగిపోయి ఈ ప్రాంతం వ్యాధుల నిలయంగా మారింది.

**విషపూరిత పొగ:**

డంపింగ్ యార్డ్‌లోని చెత్తకు తరచూ నిప్పు పెడుతుండటంతో, దాని నుండి వచ్చే విషపూరిత పొగను పీల్చి చిన్నపిల్లలు, వృద్ధులు శ్వాసకోశ సంబంధిత సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు.

**అధికారుల నిర్లక్ష్యంపై తీవ్ర ఆగ్రహం:**

ఈ డంపింగ్ యార్డ్‌ను ఊరికి దూరంగా తరలించాలని కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, ఎమ్మార్వో, ఎమ్మెల్యేలతో పాటు పలువురు ప్రజాప్రతినిధులకు ఎన్నోసార్లు అర్జీలు ఇచ్చామని స్థానికులు తెలిపారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా మున్సిపల్ సిబ్బంది మళ్లీ తెచ్చి ఇక్కడే చెత్త వేస్తున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదని వాపోయారు.

**ఉద్యమానికి సిద్ధమైన కాలనీవాసులు:**

ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, కలెక్టర్ స్పందించి డంపింగ్ యార్డ్‌ను వెంటనే ఊరికి దూరంగా తరలించి తమకు న్యాయం చేయాలని కాలనీ మహిళలు, పురుషులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు ఈడిగ వీర కృష్ణ గౌడ్, చాకలి వెంకటేశ్వర్లు, చాకలి ఎర్రన్న, చాకలి మధు, చాకలి నాగరాజు, ఈ రామస్వామి గౌడ్, గొల్ల మధు, చాకలి తాయన్న, చాకలి జమ్ములమ్మ, చాకలి శంకరమ్మ, ఎస్సీ కృష్ణవేణి, ఎస్సీ బజారి, తెలుగు మద్దమ్మతో పాటు పెద్ద సంఖ్యలో కాలనీ మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

# ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు.. ఇది చంద్రబాబు విజన్-మంత్రి నిమ్మల

**పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్ ద్వారా ఉత్తరాంధ్రకు చేరిన గోదావరి జలాలు**

**ఇది చంద్రబాబు ముందుచూపు వల్లే సాధ్యమైందని కొనియాడిన మంత్రి నిమ్మల**

**గత ఐదేళ్లలో లెఫ్ట్ కెనాల్‌పై వైసీపీ ప్రభుత్వం తట్ట మట్టి కూడా వేయలేదని ఆరోపణ**

**పోలవరం ఆలస్యం వల్ల ఈ ఏడాది 350 టీఎంసీల గోదావరి నీరు వృథా అయ్యిందని విమర్శ**

**పట్టిసీమ, పురుషోత్తపట్నంలను విమర్శించిన జగన్ అవే పథకాలపై ఆధారపడాల్సి వచ్చిందని వ్యాఖ్య**



ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కలను సాకారం చేస్తూ గోదావరి జలాలు ఈ ప్రాంతాన్ని తాకాయని, ఇది ముఖ్యమంత్రి, అపర భగీరథుడు చంద్రబాబు దార్శనికత వల్లే సాధ్యమైందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కొనియాడారు. పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్ ద్వారా ఉత్తరాంధ్రకు నీరు చేరడం రాష్ట్ర జలవనరుల చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయమని ఆయన అభివర్ణించారు. బుధవారం అనకాపల్లి జిల్లా పాయకరావుపేట వద్ద సీఎం చంద్రబాబు గోదావరి జలాలకు హారతి పట్టడం తెలిసిందే. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో నిమ్మల రామానాయుడు మాట్లాడారు. పోలవరం ప్రాజెక్ట్ పూర్తి కాకముందే, పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు, పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం ద్వారా ఉత్తరాంధ్రకు నీరందించాలన్న చంద్రబాబు ముందుచూపు వల్లే ఈరోజు ఈ ప్రాంత ప్రజల దాహం తీరుతోందని మంత్రి అన్నారు. "2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే, 2026 నాటికి లెఫ్ట్ మెయిన్ కెనాల్ పూర్తి చేస్తామని మాట ఇచ్చాం. ఇచ్చిన మాట ప్రకారం గడువులోగా పూర్తి చేసి ఈ ప్రాంతానికి గోదావరి జలాలను తీసుకొచ్చాం" అని ఆయన స్పష్టం చేశారు. ఈ రెండేళ్ల కాలంలోనే ఏలేరు, పంప, తాండవ, శారద, వరాహ వంటి ఐదు ప్రధాన నదులను, తొమ్మిది జాతీయ రహదారులను దాటుతూ కెనాల్ నిర్మాణంలో ఉన్న క్లిష్టమైన పనులను పూర్తి చేశామని తెలిపారు. కొమ్మరిలోవ వద్ద 100 మీటర్ల లోతైన కొండను తవ్వి కాలువను తీసుకురావడం తమ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. ఈ సందర్భంగా గత వైసీపీ ప్రభుత్వంపై మంత్రి నిమ్మల తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. మంచి చేసే కూటమి ప్రభుత్వానికి, రాష్ట్రాన్ని ముంచేసిన "గొడ్డలి పార్టీ"కి మధ్య ఉన్న తేడాను ప్రజలు గమనించాలని కోరుతూ మూడు కీలక విషయాలను ప్రస్తావించారు. "మొదటిది, గత ఐదేళ్ల పాలనలో వైసీపీ ప్రభుత్వం లెఫ్ట్ మెయిన్ కెనాల్‌పై కనీసం ఒక్క తట్ట మట్టి పని చేయలేదు, అరబస్తా సిమెంట్ వాడలేదు, ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టలేదు. అలాంటి పార్టీకి ఉత్తరాంధ్ర గురించి మాట్లాడే హక్కు లేదు" అని ఆరోపించారు. "రెండోది, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జగన్ అసెంబ్లీలో పట్టిసీమను 'వట్టిసీమ' అని, పురుషోత్తపట్నం పనికిరాదని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వస్తే ఆ పంపులను పీకేస్తానని హెచ్చరించారు. కానీ ఈరోజు అవే పట్టిసీమ పంపులు కృష్ణా డెల్టా ఆయకట్టును ఆదుకుంటున్నాయి. సూపర్ ఎల్ నినో సంవత్సరంలో కూడా 32 టీఎంసీల నీటిని అందించాం. అదేవిధంగా, ఆయన పీకేస్తానన్న పురుషోత్తపట్నం లిఫ్ట్ ద్వారానే నేడు ఉత్తరాంధ్రకు నీళ్లు వస్తున్నాయి. ఇది చంద్రబాబు ముందుచూపునకు, గొడ్డలి పార్టీ విధ్వంసకర పాలనకు మధ్య ఉన్న తేడా" అని మంత్రి విమర్శించారు. "మూడవది, 2019 నాటికి చంద్రబాబు పోలవరం ప్రాజెక్టును 72 శాతం పూర్తి చేశారు. ఆయన అధికారంలో కొనసాగి ఉంటే 2021కే ప్రాజెక్ట్ పూర్తయ్యేది. కానీ వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం, డయాఫ్రం వాల్ ధ్వంసం వంటి చర్యల వల్ల ప్రాజెక్టును నాశనం చేశారు. పోలవరం పూర్తయి ఉంటే, ఈ సూపర్ ఎల్ నినో సంవత్సరంలో కూడా గోదావరి నుంచి సముద్రంలో వృథాగా కలిసిన 900 టీఎంసీల వరద నీటిలో కనీసం 300 నుంచి 350 టీఎంసీలను కృష్ణా, రాయలసీమ, ఉత్తరాంధ్రకు తరలించేవాళ్లం" అని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వ అసమర్థత వల్ల తెలుగు జాతి భారీగా నష్టపోయిందని, ఈ ముంచేసే గొడ్డలి పార్టీని ఉత్తరాంధ్ర ప్రజలు తరిమి తరిమి కొట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

# కూకట్‌పల్లిలో పవన్ కల్యాణ్ బర్త్‌డే వేడుకలు- సందడి చేసిన సాయి దుర్గా తేజ్

**నేడు (సెప్టెంబరు 2) పవన్ కల్యాణ్ పుట్టినరోజు**

**తెలుగు రాష్ట్రాల్లో ఘనంగా పవన్ జన్మదిన వేడుకలు**

**కూకట్‌పల్లిలో పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు జరిపిన అభిమానులు**

**ముఖ్య అతిథిగా హాజరైన హీరో సాయి దుర్గా తేజ్**

**చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు**





జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ప్రముఖ సినీ నటుడు, పవన్ మేనల్లుడు సాయి దుర్గా తేజ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అభిమానులు, జనసేన కార్యకర్తల మధ్య ఆయన ఈ సంబరాల్లో పాల్గొన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని గోపాల్ నగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సాయి దుర్గా తేజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడి చిన్నారులతో కలిసి ఆయన పుట్టినరోజు కేక్ కట్ చేశారు. అనంతరం పవన్ కల్యాణ్‌కు తన హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకల్లో అభిమానులు, జనసేన మద్దతుదారులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం, పుట్టినరోజు వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని సాయి దుర్గా తేజ్ సందర్శించారు. అక్కడ ఏర్పాట్లను పరిశీలించి, రక్తదానం వంటి గొప్ప కార్యక్రమాన్ని నిర్వహించినందుకు నిర్వాహకులను, వాలంటీర్లను అభినందించారు. రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చిన వారిని ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ కార్యక్రమం కేవలం పవన్ కల్యాణ్‌పై అభిమానాన్ని చాటడమే కాకుండా, సామాజిక సేవ, సమాజ సంక్షేమాన్ని ప్రోత్సహించే ఒక మంచి అవకాశంగా నిలిచింది. పవన్ పుట్టినరోజును ఒక సేవా కార్యక్రమంగా జరపడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

# పాదయాత్రగా ఉరుకుంద ఈరన్న స్వామి దర్శనం



కౌతాళం సెప్టెంబర్3 (సూర్యఉదయం):-ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయాన్ని టీడీపీ జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ దర్శించుకున్నారు. ఎరిగేరి గ్రామం నుంచి సుమారు 10 కిలోమీటర్లు పాదయాత్రగా ఆలయానికి చేరుకున్న ఆమెకు ఆలయ అధికారులు మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయ గర్భగుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించిన కృష్ణమ్మ స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సమావేశంలో కౌతాళం మండల అధ్యక్షులు సురేశ్ నాయుడు,టీడీపీ నాయకులు,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# కోసిగిలో ఘనంగా డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి వర్ధంతి వేడుకలు



**కోసిగి సెప్టెంబర్ 2 (సూర్య ఉదయం ప్రతినిధి మంత్రాలయం):** కోసిగి మండల కేంద్రంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా వైయస్సార్ సర్కిల్‌లోని ఆయన విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు ఘనంగా నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి, యువనేత వై. ధరణి రెడ్డిల ఆదేశాల మేరకు, మండల ఇన్‌చార్జ్ మురళీమోహన్ రెడ్డి సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ ఈరన్న, నాడిగేని నాగరాజులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు వైయస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి, పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ..ముఖ్యమంత్రిగా ప్రజల నాయకుడు వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి పేదల సంక్షేమానికి అహర్నిశలు కృషి చేసిన చిరస్మరణీయ నాయకుడని కొనియాడారు.

**చిరస్థాయి పథకాలు:** ఆయన ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్మెంట్, ఉచిత విద్యుత్ వంటి పథకాలు నేటికీ ప్రజల గుండెల్లో ఆయనను నిలిపి ఉంచాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు, అనుబంధ విభాగాల ప్రతినిధులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని వైయస్సార్ అమర్ రహే అంటూ నినాదాలు చేశారు.

# తుంగభద్ర డిసి చైర్మన్లు రాజీనామా చేయాలి

**వైసిపి నేతలు డిమాండ్...**



**సూర్య ఉదయం ప్రతినిధి :పెద్దకడబూర్ :** పెద్దకడబూరు మండలంలోని పంటలకు సాగునీరు, గ్రామాలకు తాగునీరు అందించాలని, లేనిపక్షంలో తుంగభద్ర డీసీ చైర్మన్లు రాజీనామా చేయాలని వైసీపీ రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యులు పురుషోత్తం రెడ్డి,మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి,డిమాండ్ చేశారు అనంతరం రైతుల సమస్యలపై తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం వైసిపి నేతలు మాట్లాడుతూ టీడీపీ రాష్ట్ర రైతు అధికార ప్రతినిధి అధికారం బలంతో ఆయన సొంత భూమి ఆయకట్టు 13 ఎకరాలకు మాత్రమే సాగనీరు అందించుకోవడం చాలా దుర్మార్గమైన కార్యక్రమానికి వడి కడుతున్నారని .. మండలంలో రైతులు వర్రీ,పత్తి,మిరప, ఇతర పంటలు సాగునీరు అందక పంటలు ఎండిపోయే దశలో ఉన్నాయని, తక్షణమే నాయకులు, ప్రభుత్వ అధికారులు స్పందించి నీటిని విడుదల చేయాలన్నారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఎమ్మార్వో వలీభాషా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి రైతు అధికార ప్రతినిధి రవిచంద్రారెడ్డి, వాణిజ్య విభాగా అధ్యక్షులు బ్రహ్మయ్య, మాజీ సర్పంచ్ దొడ్డి మేకల చంద్ర శేఖర్, ముక్కరన్న, ఆర్లప్ప, రాజు, ఒలేప్ప, ఏసన్న,సుందరం, గూడుబాషా, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

# కౌతాళం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా చల్లా శ్రీనివాస్ శెట్టి

**మహిళా సంఘం అధ్యక్షురాలిగా చల్లా జయశ్రీ**



**కౌతాళం, సెప్టెంబర్ 3(సూర్యఉదయం):-** కౌతాళం మండల నూతన ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా చల్లా శ్రీనివాస్ శెట్టి,మహిళా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షురాలిగా చల్లా జయశ్రీ ప్రమాణ స్వీకారం చేశారు. ఉరుకుంద దేవస్థానం ఎస్‌యూవీ కళ్యాణ మండపంలో బుధవారం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి,మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్ గుప్తా ముఖ్య అతిథిగా హాజరై నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. సంఘ సభ్యులకు ఏ సమస్య వచ్చినా సోదరుడిగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. సభ్యుల మధ్య మనస్పర్థలు ఉంటే చర్చల ద్వారా పరిష్కరించుకుని ఐక్యతతో ముందుకు సాగాలని సూచించారు. నూతన కార్యవర్గంలో ప్రధాన కార్యదర్శిగా విజయ్ కుమార్ శెట్టి, కోశాధికారిగా చల్లా వెంకటేష్ శెట్టి,గౌరవ అధ్యక్షుడిగా రాఘవేంద్ర శెట్టి, మీడియా ప్రతినిధిగా చిగిలి మంజునాథ్ గుప్త, జాయింట్ సెక్రెటరీగా చల్లా వినయ్ కుమార్ ని ఎన్నుకున్నారు. మహిళా సంఘం ప్రధాన కార్యదర్శిగా బి. కళావతి,కోశాధికారిగా చల్లా ఉషారాణి బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు విట్టా రమేష్, ఉరుకుంద ట్రస్ట్ బోర్డు చైర్మన్ డిజి పాండురంగ శెట్టి, కర్నూలు జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బి.భాస్కర్ శెట్టి, జిల్లా ప్రధాన కార్యదర్శి గ్రంధి వెంకటగిరి, జిల్లా కోశాధికారి ప్రతాప్ రంగయ్య శెట్టి,జిల్లా యువజన అధ్యక్షుడు రవీంద్రబాబు,కౌతాళం ఆర్యవైశ్య సంఘం నాయకులు,సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.ం

# నేపాల్ వరదల్లో కైలాస యాత్రికులు గల్లంతు.. ఆచూకీ కోసం ఎదురుచూస్తున్న తెలుగు కుటుంబాలు

**నేపాల్ వరదల్లో పలువురు కైలాస యాత్రికులు గల్లంతు**

**లభ్యం కాని హైదరాబాద్‌కు చెందిన ఎన్నారై కుటుంబం**

**మరో యాత్రికుడు ధన్‌పాల్ రెడ్డి కోసం కుటుంబ సభ్యుల ఎదురుచూపు**

**గల్లంతైన వారిలో ఏపీకి చెందిన ఎన్నారై కూడా ఉన్నట్లు సమాచారం**

**సమాచారం అందక ఆందోళనలో పలు తెలుగు కుటుంబాలు**

కైలాస మానస సరోవర యాత్రకు వెళ్లిన పలువురు తెలుగు యాత్రికులు నేపాల్‌లో సంభవించిన ఆకస్మిక వరదల్లో గల్లంతయ్యారు. వీరిలో ప్రవాస భారతీయులు కూడా ఉండటంతో వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఆగస్టు 26న ఈ విపత్తు సంభవించినప్పటి నుంచి వారి గురించి ఎలాంటి సమాచారం లభించకపోవడంతో బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు. క్షేత్రస్థాయిలో సహాయక చర్యలు కొనసాగుతున్నప్పటికీ, సమాచారం చేరడంలో జాప్యం జరుగుతుండటంతో బాధితుల కుటుంబాలు ఆశతో ఎదురుచూస్తున్నాయి. హైదరాబాద్‌కు చెందిన ఎన్నారై శ్రీధర్ అవ్వారి, ఆయన భార్య దీప్తి, 14 ఏళ్ల కుమారుడు అభినవ్ ఆగస్టు 13న ఈశా ఫౌండేషన్ బృందంతో కలిసి యాత్రకు వెళ్లారు. ఆగస్టు 26 నుంచి వారి ఫోన్లు స్విచ్ ఆఫ్ రావడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు ఈశా ఫౌండేషన్‌ను సంప్రదించారు. యాత్ర ముగించుకుని తిరిగి వస్తున్న క్రమంలో, నేపాల్-చైనా సరిహద్దులోని ఇమ్మిగ్రేషన్ కేంద్రం వద్ద వారు వరదల్లో చిక్కుకున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారని దీప్తి సోదరుడి భార్య ప్రియాంక రాపాక వివరించారు. మణికొండకు చెందిన 38 ఏళ్ల ధన్‌పాల్ రెడ్డి ఆచూకీ కూడా ఇంకా లభ్యం కాలేదు. పుణే నుంచి వెళ్లిన 66 మంది యాత్రికుల బృందంలో తెలంగాణకు చెందిన వ్యక్తి ఈయన ఒక్కరే. వరదలు సంభవించిన రోజున నేపాల్ ఇమ్మిగ్రేషన్ సెంటర్ నుంచి ఆయన చివరిసారిగా కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఆయన ఆచూకీ కోసం బాధితులు సైబరాబాద్ పోలీసులను ఆశ్రయించారు. చేతులు, భుజాలపై ఉన్న శివుడి టాటూల ద్వారా తన భర్తను గుర్తించవచ్చని ఆయన భార్య సుప్రియ పేర్కొన్నారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ బాధితుని కుటుంబ సభ్యులతో మాట్లాడి, తగిన సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లాకు చెందిన, ప్రస్తుతం ఖతార్‌లో నివసిస్తున్న ఎన్నారై చొప్పరపు రమేశ్‌బాబు సైతం ఇదే యాత్రకు వెళ్లి గల్లంతయ్యారు. మరోవైపు, ఇదే మార్గంలో యాత్రకు వెళ్లిన హైదరాబాద్‌కు చెందిన రాజేశ్వరి అనే మహిళ, ఈ విపత్తు సంభవించడానికి నాలుగు రోజుల ముందే సురక్షితంగా తిరిగి రావడం గమనార్హం.

## ప్రభుత్వానికి ఊరట కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై స్టే ఎత్తివేసిన ధర్మాసనం

**కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై ప్రభుత్వానికి ఊరట**

**సింగిల్ బెంచ్ ఇచ్చిన స్టేను ఎత్తివేసిన సీజే ధర్మాసనం**

**12 ఏళ్ల నుంచి కొనసాగుతున్న పథకాలపై సింగిల్ జడ్జి స్టే విధించారన్న ఏజీ తెలంగాణ హైకోర్టు**




కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టులో ఊరట లభించింది. పథకాల అమలుపై సింగిల్ బెంచ్ ఇచ్చిన స్టేను సీజే ధర్మాసనం రద్దు చేసింది. పథకాలపై స్టే విధించడాన్ని సవాల్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీలుపై న్యాయస్థానం విచారణ చేపట్టింది. ఈ పథకాల నిమిత్తం తెలంగాణ ప్రభుత్వం 2014 సంవత్సరం నుంచి జారీ చేసిన 8 జీవోలను సవాల్ చేస్తూ న్యాయవాది విజయ్‌గోపాల్ వ్యక్తిగత హోదాలో దాఖలు చేసిన పిటిషన్‌లో ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయలేదు. దీంతో ఈ పథకాల అమలును నిలిపివేస్తూ సింగిలూజడ్జి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు.ప్రజాప్రయోజన వ్యాజ్యం కాదని వాదనలు అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ 2014 సంవత్సరం నుంచి అమలు అవుతున్న సంక్షేమ పథకాలపై పిటిషన్ దాఖలైందని గుర్తు చేశారు. ఈ పథకాల అమలు పిటిషనర్‌పై ఎలాంటి ప్రభావం చూపడం లేదని అన్నారు. అతని హక్కులకూ భంగం వాటిల్లలేదని, అంతేకాకుండా పథకం లబ్ధిదారు కూడా కాదని తెలిపారు. ఇది ప్రజాప్రయోజన వ్యాజ్యం కాదని పేర్కొన్నారు.షాదీ ముబారక్ లాంటి పథకాన్ని సుప్రీంకోర్టు అనుమతించిందని, అలాంటిదే కల్యాణలక్ష్మి పథకమని ఎ.సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఈ పిటిషన్ సింగిల్ జడ్జి వద్ద విచారణార్హం కాదని, ప్రభుత్వ విధాన నిర్ణయాలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను విచారించే పరిధి ఈ డివిజన్ బెంచ్‌కు ఉందని తెలిపారు. పథకం అమలుపై ఉన్న మధ్యంతర ఉత్తర్వులను ఎత్తివేయాలని కోరారు. అడ్వొకేట్ జనరల్ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం స్టేను ఎత్తివేస్తూ ఆదేశాలు జారీ చేసింది.గత నెల 12న స్టే తెలంగాణలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలును నిలిపివేస్తూ గత నెల 12న హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పథకాల అమలు కోసం 2014 నుంచి జారీ చేసిన ఎనిమిది ప్రభుత్వ ఉత్తర్వుల (జీవో) అమలుపై కోర్టు స్టే విధించింది. అలాగే వీటి కింద ఎంపికైన లబ్ధిదారులకు ఎటువంటి చెల్లింపులు చేయకూడదని ఆదేశించింది. ఈ పథకాలకు సంబంధించిన జీవోలను సవాలు చేస్తూ న్యాయవాది విజయ్?గోపాల్ వ్యక్తిగత హోదాలో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. జస్టిస్ ఎన్?వీ శ్రవణ్ కుమార్ ఈ అంశంపై విచారణ చేపట్టారు. వాదనల సందర్భంగా ఈ పథకాల అమలు కోసం జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులకు రాజ్యాంగపరమైన చెల్లుబాటు లేదని పిటిషనర్ వాదించారు.

## ఆర్టీసీలో 1,500 కండక్టర్ పోస్టులు భర్తీ చేస్తాం మంత్రి పొన్నం ప్రభాకర్

**ఆర్టీసీలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నామన్న మంత్రి పొన్నం ప్రభాకర్**

**దాదాపు 4 వేల ఉద్యోగాల భర్తీ ప్రక్రియ కూడా చివరిదశలో ఉందని వెల్లడి**

**ఆర్టీసీ స్థలాలు ప్రభుత్వానికి ఇస్తే తప్పేంటని ప్రశ్న**




టీజీఎస్‌ఆర్టీసీలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆర్టీసీలో 1,500 కండక్టర్ పోస్టులు భర్తీ చేస్తామని, దాదాపు 4 వేల ఉద్యోగాల భర్తీ ప్రక్రియ కూడా చివరిదశలో ఉందని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించేందుకు పెద్దపీట వేసిందని ఆదిశగా రవాణా సంస్థలో మరిన్ని మార్పులు తెస్తున్నామన్నారు. త్వరలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఆర్టీసీ ఉద్యోగులు, ప్రయాణికులకు సమాన ప్రాధాన్యత ఇస్తున్నమని వివరించారు. నిత్యం 65 లక్షల మందికిపైగా ఆర్టీసీ సేవలు సద్వినియోగం చేసుకుంటున్నారని పేర్కొన్నారు.ఇందిరమ్మ ఇళ్లకు ఆర్టీసీ స్థలాలు తప్పకుండా ఇస్తాం ఆర్టీసీ స్థలాలు ప్రభుత్వానికి ఇస్తే తప్పేంటని పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. ప్రభుత్వం, ఆర్టీసీ ఒక్కటనని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఆర్టీసీకి ఎన్నో వందల ఎకరాలు ఇచ్చిందని గుర్తు చేశారు. పేద ప్రజల కోసం ఇందిరమ్మ ఇళ్లకు ఆర్టీసీ స్థలాలు తప్పకుండా ఇస్తామని వెల్లడించారు. హైదరాబాద్‌లో ఆర్డినరీ బస్సులు తగ్గలేదని, వెయ్యి రోజుల పాలనలో రవాణా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చామని అన్నారు. హైదరాబాద్‌లో మరో 2,200 ఎలక్ట్రిక్ బస్సులు రోడ్డెక్కనున్నాయని వెల్లడించారు.“ఆర్టీసీలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నాం. టీజీ ఆర్టీసీ కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తోంది. పీఎం ఈడ్రైవ్ కింద మరో 2200 ఎలక్ట్రిక్ బస్సులు తెస్తున్నాం. ఆర్టీసీలో త్వరలోనే గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహిస్తాం. ఆర్టీసీ ఉద్యోగులు, ప్రయాణికులకు సమాన ప్రాధాన్యం ఇస్తున్నాం. ప్రయాణికులకు వసతులు, ఉద్యోగుల సంక్షేమానికి చర్యలు చేపట్టాం. ఆర్టీసీలో 1,500 కండక్టర్ పోస్టులు భర్తీ చేస్తాం. దాదాపు 4 వేల ఉద్యోగాల భర్తీ ప్రక్రియ కూడా చివరిదశలో ఉంది. ఆటోలకు రెట్రో ఫిట్‌మెంట్ కోసం రూ.200 కోట్లు కేటాయించాం. వెయ్యి రోజుల పాలనలో ఆర్టీసీలో కూడా ఎన్నో మార్పులు వచ్చాయి. రోజుకు 65 లక్షల మంది ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. మహిళలకు ఉచిత ప్రయాణం వల్ల ఆర్టీసీపై ఒత్తిడి పెరిగింది. ఆర్టీసీపై ఎంత ఒత్తిడి పడినా రాజీపడకుండా సేవలు అందిస్తున్నాం” పొన్నం ప్రభాకర్, మంత్రి

## కానిస్టేబుల్‌పై కత్తితో దాడి నిందితుడిపై కాల్పులు

**పోలీసులపై కత్తితో దాడి చేసిన నిందితుడిపై కాల్పులు**

**నిందితుడు అవినాథ్ కాళ్లపై కాల్పులు జరిపిన కంకిపాడు సీఐ**

**నిందితుడి కాళ్లకు గాయాలు, విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలింపు**

పోలీసులపై కత్తితో దాడి చేసిన నిందితుడిపై పోలీసులు కాల్పులు జరిపారు. కృష్ణా జిల్లా కంకిపాడు మండలం కోమటికుంటలాకుల డొంకరోడ్డులో ఈ ఘటన చోటు చేసుకుంది. నిందితుడు అవినాద్ కాళ్లపై కంకిపాడు సీఐ కాల్పులు జరిపినట్టు సమాచారం. సోమవారం ఉదయం తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల సమీపంలోని దేవరపల్లి ప్రాంతంలో కానిస్టేబుల్ వెంకటేశ్వరరావుపై అవినాద్ అనే వ్యక్తి కత్తితో ఘాతుకానికి ఒడిగట్టాడు. తీవ్రంగా గాయపరిచిన అనంతరం అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ క్రమంలో నిందితుడి కోసం పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు.నిందితుడు అవినాద్ కృష్ణా జిల్లా కంకిపాడు మండలం కోమటికుంటలాకుల డొంకరోడ్డు పరిసరాల్లో సంచరిస్తున్నట్లు రాత్రి 11 గంటల సమయంలో పోలీసులకు సమాచారం అందింది. దీంతో కంకిపాడు, గన్నవరం సీఐలు తమ సిబ్బందితో కలిసి ఆ ప్రాంతాన్ని ముట్టడించారు. పోలీసులను గమనించిన నిందితుడు లొంగిపోవడానికి నిరాకరించాడు.పోలీసులపై కత్తి, రాళ్లతో దాడి: పట్టుకునేందుకు వెళ్లిన పోలీసులపై అవినాద్ ఒక్కసారిగా కత్తితో దాడి చేసి, రాళ్లతో దాడికి దిగాడు. ఈ అకస్మాత్తు దాడిలో కానిస్టేబుల్ శ్రీనివాస్ ఛాతిపై తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి అదుపు తప్పుతుండటంతో అప్రమత్తమైన కంకిపాడు సీఐ, నిందితుడు అవినాద్ కాళ్లపై కాల్పులు జరిపారు. కాల్పుల్లో గాయపడిన నిందితుడిని విజయవాడ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు.కంకిపాడు కాల్పుల ఘటనపై ఉన్నతాధికారులు స్పందించారు. నిందితుడు అవినాద్‌ను అదుపులోకి తీసుకోవాలని వెళ్లినప్పుడు అతడు పోలీసులపై రాళ్లతో దాడి చేయడంతో తొలుత పోలీసులు గాలిలోకి రెండు రౌండ్లు కాల్పులు జరిపినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనలో కాళ్లపై షూట్ చేయడంతో బుల్లెట్ గాయంతో అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితుడిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించినట్లు వెల్లడించారు.“రాళ్లతో దాడి చేయడంతో గాలిలోకి రెండు రౌండ్లు కాల్పులు జరిపారు. కాలికి షూట్ చేయడంతో బుల్లెట్ గాయంతో అదుపులోకి తీసుకున్నాం. ఆస్పత్రికి తరలించి చికిత్స కూడా అందించాం. గంజాయి తరలించే గ్యాంగ్‌లో అవినాద్ పెనమలూరు వాసి. ఏజెన్సీ ప్రాంతాలకు వెళ్లి గంజాయి తెచ్చి విక్రయిస్తున్నాడు. పోలీసులను గాయపరిచి బెదిరించాలనుకుంటే చూస్తూ ఊరుకోం. ఉపాధి లేకపోతే మా వద్దకు వస్తే వారికి ఉపాధి కల్పిస్తాం. చెడు మార్గాల్లో వెళ్తుంటే పోలీసులు చూస్తూ ఊరుకోరు” - విద్యాసాగర్ నాయుడు, కృష్ణా జిల్లా ఎస్పీ.ఏజెన్సీ నుంచి గంజాయి అక్రమ రవాణా:



పోలీసులు విచారణలో నిందితుడిపై కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. పెనమలూరు ప్రాంతానికి చెందిన అవినాద్ గంజాయి రవాణా చేసే ముఠాలో సభ్యుడని పోలీసులు తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాలకు వెళ్లి అక్కడి నుంచి పెద్ద ఎత్తున గంజాయి తెచ్చి, విక్రయిస్తున్నాడని ప్రాథమిక విచారణలో పోలీసులు గుర్తించారు.చెడు మార్గంలో వెళ్తే ఉక్కుపాదం: మీ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా గంజాయి విక్రయిస్తున్నా, లేదా అనుమానాస్పదంగా సంచరిస్తున్నా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. పోలీసులను గాయపరిచి, చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని బెదిరించాలని చూస్తే సహించే ప్రసక్తే లేదని, చెడు మార్గాల్లో వెళ్తుంటే ఊరుకోమని హెచ్చరించారు. యువత ఉపాధి లేక ఇబ్బంది పడుతుంటే తమ వద్దకు వస్తే పోలీసుల ఆధ్వర్యంలో ఉపాధిని కల్పిస్తామని పిలుపునిచ్చారు.

## హైదరాబాద్‌లో డ్రగ్స్ ముఠా అరెస్ట్.. ఎక్సైజ్ మాజీ కానిస్టేబుల్ అరెస్ట్

**కొంపల్లిలో భారీగా అల్ప్రాజోలం డ్రగ్స్ పట్టివేత**

**సుమారు రూ.19 లక్షల విలువైన 1.9 కిలోల డ్రగ్స్ స్వాధీనం**

**ఐదుగురు సభ్యుల ముఠాను అరెస్ట్ చేసిన పోలీసులు**



హైదరాబాద్ నగర శివారు కొంపల్లిలో భారీగా డ్రగ్స్ సరఫరా చేస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. నిందితుల నుంచి సుమారు రూ.19 లక్షల విలువైన 1.9 కిలోల అల్ప్రాజోలం డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి ఐదుగురిని అరెస్ట్ చేయగా, ప్రధాన నిందితుడు మాజీ ఎక్సైజ్ కానిస్టేబుల్ కావడం గమనార్హం. పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొంపల్లి జయభేరి పార్క్ సమీపంలో డ్రగ్స్ విక్రయిస్తున్నట్టు పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు, ఆ ప్రాంతంలో నిఘా పెట్టి నిందితులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారి వద్ద నుంచి అల్ప్రాజోలంతో పాటు రూ.40,000 నగదు, ఒక కారు, ఒక బైక్, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.ఈ ముఠాకు మాజీ ఎక్సైజ్ కానిస్టేబుల్ గొల్ల రమేశ్ సూత్రధారిగా ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. అతడిపై గతంలోనే మూడు ఎన్డీపీఎస్ కేసులు నమోదై ఉన్నాయి. కామారెడ్డి నుంచి డ్రగ్స్‌ను తీసుకువచ్చి కొంపల్లి, కుత్బుల్లాపూర్ పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్టు విచారణలో తేలింది. ఈ డ్రగ్స్ నెట్‌వర్క్‌పై పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

## నేపాల్ వరదల ధాటికి ఆ ఇల్లు ఎలా తట్టుకుంది.. యజమాని చెప్పింది ఇదే

**నేపాల్ వరద బీభత్సంలో ఒంటరిగా నిలిచిన 40 ఏళ్ల పాత ఇల్లు**

**చుట్టూ భవనాలు కొట్టుకుపోయినా చెక్కుచెదరని నిర్మాణం**

**బలమైన పునాది, నాణ్యమైన నిర్మాణమే కారణమంటున్న యజమాని**

**గంటన్నర పాటు బిక్కుబిక్కుమంటూ గడిపి ప్రాణాలతో బయటపడ్డ కుటుంబం**



విపత్తులో ఆశాకిరణంగా నిలిచి వైరల్ అయిన పచ్చటి ఇల్లు

నేపాల్‌లో సంభవించిన భారీ వరద బీభత్సం మధ్య, నువాకోట్ జిల్లాలోని 40 ఏళ్ల నాటి ఓ ఆకుపచ్చ ఇల్లు ధైర్యానికి, పటిష్ట నిర్మాణానికి ప్రతీకగా నిలిచింది. త్రిశూలి నది ఉప్పొంగి సృష్టించిన జల ప్రళయంలో చుట్టుపక్కల భవనాలు, వాహనాలు, దుకాణాలు అన్నీ కొట్టుకుపోయినా, ఈ ఇల్లు మాత్రం చెక్కుచెదరకుండా నిలబడటం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఈ ఇంటి వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో, ఇది విపత్తులో ఒక ఆశాకిరణంగా మారింది.ఆగస్టు 26న సంభవించిన ఈ ఆకస్మిక వరదల్లో, ప్రకాశ్ అనే వ్యక్తికి చెందిన ఈ ఇల్లు పూర్తిగా నీటిలో చిక్కుకుంది. బురద, చెత్తాచెదారం, భారీ బండరాళ్లతో కూడిన వరద ప్రవాహం ఇంటి కింది అంతస్తును ముంచెత్తింది. ఆ సమయంలో ప్రకాశ్, ఆయన భార్య లక్ష్మితోపాటు కుటుంబ సభ్యులు (సుమారు 5-6 మంది) మేడపైకి, బాల్కనీలోకి చేరి ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని గడిపారు. సుమారు గంటన్నర పాటు నరకాన్ని చూశారు. “మా జీవితాలు బహుశా ముగిసిపోయాయేమో అనిపించింది” అని ప్రకాశ్ ఆ భయానక క్షణాలను గుర్తుచేసుకున్నారు.నీటి ప్రవాహం కాస్త తగ్గిన తర్వాత స్థానికులు అక్కడికి చేరుకుని, ఓ పైపును వంతెనలా వేసి, తాడు సాయంతో ప్రకాశ్ కుటుంబాన్ని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. ఈ ఘటనలో వారి వాహనాలు, దుకాణంలోని సరుకులు, ఇంటి సామగ్రి కొట్టుకుపోయినా, ప్రాణాలతో బయటపడటంతో ఊపిరి పీల్చుకున్నారు.సుమారు 40 ఏళ్ల క్రితం కట్టిన ఈ ఇంటి పటిష్ఠతే తమను కాపాడిందని యజమాని ప్రకాశ్ విశ్వసిస్తున్నారు. నది ఒడ్డున ఉన్నందున, పునాదిని చాలా బలంగా వేశామని, నాటి సిమెంట్, ఇతర నిర్మాణ సామగ్రి నాణ్యత కూడా ఇందుకు కారణమని ఆయన తెలిపారు.నిపుణుల విశ్లేషణ ప్రకారం, ఈ ఇంటిని రీఇన్‌ఫోర్స్‌డ్ కాంక్రీట్ ఫ్రేమ్ (ఆర్‌సీసీ)తో నిర్మించారు. పునాది, స్తంభాలు, బీమ్‌లను స్టీల్ రాడ్లతో అనుసంధానించడం వల్ల ఇది వరద ప్రవాహపు తీవ్రమైన ఒత్తిడిని తట్టుకోగలిగింది. హిమాలయ ప్రాంతాల్లోని సంప్రదాయ రాతి కట్టడాలు ఇలాంటి ఒత్తిడికి కూలిపోతాయి. ఇంటి ఆకారం, అది ఉన్న ప్రదేశం కూడా వరద నీరు చుట్టూ ప్రవహించి వెళ్లేందుకు దోహదపడ్డాయని నిపుణులు భావిస్తున్నారు. ఆసక్తికరంగా, ఈ ఇల్లు 2015లో వచ్చిన భారీ భూకంపాన్ని కూడా తట్టుకుని నిలబడింది. వేలాది మంది గల్లంతైన ఈ ఘోర విపత్తులో, ఈ పచ్చటి ఇల్లు ఒక ఆశాకిరణంగా నిలిచింది.

## జైలు నుంచి వచ్చాక కూడా మారని నైజం.. శ్మశానంలో శవ భాగాలను తింటూ కలకలం రేపిన లేడీ అఘోరీ

**ఉత్తరాది రాష్ట్రాలకు మకాం మార్చిన లేడీ అఘోరీ**

**చితి నుంచి తీసిన శవం భాగాలను తింటూ వీడియో , తనతో చాలా జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిక**



గతంలో తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర సంచలనం సృష్టించి, జైలుకు వెళ్లొచ్చిన ‘లేడీ అఘోరీ’ ఉదంతం మరోసారి తీవ్ర వివాదాస్పదమైంది. జైలు జీవితం తర్వాత సాధారణ జీవితం గడుపుతుందని భావించినప్పటికీ, ఆమె ఉత్తరాది రాష్ట్రాలకు మకాం మార్చి, అక్కడ కూడా అదే విధమైన విపరీతమైన చర్యలు, క్షుద్ర వీడియోలు చేస్తూ సోషల్ మీడియాలో కలకలం రేపుతోంది.తాజాగా మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని చక్రతీర్థ శ్మశానవాటికలో చిత్రీకరించిన ఒక షాకింగ్ వీడియోను లేడీ అఘోరీ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పోస్ట్ చేసింది. చేతిలో కత్తి పట్టుకుని, మండుతున్న చితి వద్దకు వెళ్లిన లేడీ అఘోరీ... చితి నుంచి మానవ శరీర భాగాలను (మాంసం) కత్తితో బయటకు తీసి తింటున్నట్లు వీడియోలో కనిపించింది.“ఈ రోజు మనిషి మాంసాన్ని తింటున్నాను, ఇది వేడిగా, చాలా రుచిగా ఉంది. మీరు చనిపోయినా మిమ్మల్ని కూడా ఇలాగే తింటాను. పెద్ద పెద్ద మాంత్రికులనే ఎదురించాను, నాతో జాగ్రత్తగా ఉండండి” అంటూ బెదిరింపులకు దిగింది. శ్మశానంలో గడపడం, భూతప్రేతాలతో ఆడుకోవడమే తన పని అని వ్యాఖ్యానించింది. ఈ వీడియోపై నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆమెను మరోసారి అరెస్ట్ చేసి, జైలుకు పంపాలని కామెంట్ చేస్తున్నారు.

## వికటించిన మలేరియా మాత్రలు చిన్నారి మృతి మరో 53 మందికి అస్వస్థతూ

**పోలవరం జిల్లాలో మలేరియా మాత్రలు వికటించి చిన్నారి మృతి**

**మరో 53 మందికి అస్వస్థత చిన్నారులను లక్ష్మీపురం పీహెచ్‌సీ, భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలింపు**

పోలవరం జిల్లా ఎటపాక మండలం గొల్లగుప్పలో విషాదం చోటుచేసుకుంది. మలేరియా మాత్రలు వికటించి ఓ చిన్నారి మృతి చెందగా మరో 53 మంది అస్వస్థతకు గురయ్యారు. వారిలో కొందరిని లక్ష్మీపురం పీహెచ్?సీకి మరికొందరిని భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.పోలవరం జిల్లా ఎటపాక మండలం గొల్లగుప్పలో మంగళవారం వైద్య సిబ్బంది పర్యటించి 71 మందికి మలేరియా నివారణకు క్లోరోక్విన్ మాత్రలను ఇచ్చారు. పాఠశాలల్లో విద్యార్థులతోనూ మింగించారు. గ్రామానికి చెందిన ఏడేళ్ల మడివి జమున సాయంత్రం ఇంటికి వెళ్లి వాంతులు చేసుకోవడంతో లక్ష్మీపురం ఆసుపత్రికి తరలించారు. ఆ చిన్నారి అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆ చిన్నారి మూడు మాత్రలు వేసుకున్నట్లు చెబుతున్నారు. క్రమంగా గ్రామంలోని పాఠశాల, అంగన్‌వాడీ చిన్నారులు 53 మంది అస్వస్థతకు గురయ్యారు. వారిలో కొందరిని లక్ష్మీపురం పీహెచ్‌సీకి, మరికొం దరిని భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. వీరిలో 46 మంది చిన్నారులు కాగా ఏడుగురు పెద్దవారని అధికారులు తెలిపారు.అందరి ఆరోగ్యం నిలకడగానే ఉంది: చిన్నారులంతా రెండేళ్ల నుంచి పదేళ్లలోపువారేనని, ప్రస్తుతం అందరి ఆరోగ్యం నిలకడగానే ఉందని కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. ఘటన వెనుక కారణాలు తెలుసుకోవడానికి, సహాయ చర్యలకు రాజమహేంద్రవరం, కాకినాడ, పాడేరు, విజయవాడ నుంచి రాపిడ్ రెస్పాన్స్ ఫోర్స్‌లను అధికారులు గ్రామానికి పంపిస్తున్నారు. పంపిణీ చేసిన మాత్రలు ఎక్కడి నుంచి వచ్చాయి, ఎప్పుడొచ్చాయనే వివరాలపై వైద్యారోగ్యశాఖ దృష్టి పెట్టింది.మెరుగైన వైద్యం అందించాలి: క్లోరోక్విన్ మాత్రలు వికటించి బాలిక చనిపోయిన సమాచారంపై



సీఎం చంద్రబాబు సమీక్షించారు. దీనిపై వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ తో మాట్లాడారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని, ఘటనపై సమగ్ర దర్యాప్తు చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం బాధితుల ఆరోగ్యం నిలకడగా ఉందని అధికారులు సీఎంకు వివరించారు. కాకినాడ జీజీహెచ్ నుంచి ఇప్పటికే 9 మంది వైద్యులతో ప్రత్యేక బృందాన్ని పంపగా, మరో మూడు వైద్య బృందాలు విజయవాడ, రాజమహేంద్రవరం, కాకినాడ నుంచి బయలుదేరినట్లు తెలిపారు.

## ఆదాయంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సత్తా.. దేశంలో నాలుగో స్థానం

**దేశంలో అత్యధిక ఆదాయం గల రైల్వే స్టేషన్లలో సికింద్రాబాద్‌కు 4వ స్థానం**

**గత ఆర్థిక సంవత్సరంలో రూ.1,276 కోట్ల ప్రయాణికుల ఆదాయం నమోదు**

**న్యూఢిల్లీ, హౌరా, చెన్నై తర్వాత నాలుగో స్థానంలో నిలిచిన సికింద్రాబాద్**

**రూ.714 కోట్లతో అమృత్ భారత్ పథకం కింద స్టేషన్ ఆధునికీకరణ పనులు**

**ఆధునికీకరణతో టాప్-3కి చేరే అవకాశం ఉందని రైల్వే అధికారుల అంచనా**



దేశంలో అత్యధిక వార్షికాదాయం ఆర్జించే రైల్వే స్టేషన్ల జాబితాలో సికింద్రాబాద్ జంక్షన్ సత్తా చాటింది. ప్రయాణికుల రాకపోకలు, ఆదాయం రెండింటిలోనూ దేశంలోనే నాలుగో స్థానంలో నిలిచి ప్రత్యేక గుర్తింపు పొందింది. గత ఆర్థిక సంవత్సరంలో సికింద్రాబాద్ స్టేషన్ ప్రయాణికుల ద్వారా రూ.1,276.29 కోట్ల ఆదాయం ఆర్జించగా, సుమారు 2.78 కోట్ల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించారు. ఈ వివరాలను రైల్వే శాఖ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది.రైల్వే నివేదిక ప్రకారం, ఈ జాబితాలో న్యూఢిల్లీ స్టేషన్ రూ.3,337 కోట్లతో మొదటి స్థానంలో ఉంది. ఆ తర్వాత పశ్చిమ బెంగాల్‌లోని హౌరా (రూ.1,692 కోట్లు), తమిళనాడులోని ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (రూ.1,299 కోట్లు) స్టేషన్లు రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. వీటి తర్వాత సికింద్రాబాద్ నాలుగో స్థానాన్ని దక్కించుకుంది. ఉత్తర, దక్షిణ భారత రాష్ట్రాల మధ్య కీలకమైన అనుసంధాన కేంద్రంగా ఉండటమే సికింద్రాబాద్ స్టేషన్ ఈ ఘనత సాధించడానికి ప్రధాన కారణమని రైల్వే శాఖ పేర్కొంది.దక్షిణ మధ్య రైల్వేకు జోనల్ ప్రధాన కార్యాలయంగా ఉన్న సికింద్రాబాద్ నుంచి రోజుకు సుమారు 180కి పైగా రైళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రతిరోజూ దాదాపు 1.5 లక్షల నుంచి 2 లక్షల మంది ప్రయాణికులు ఈ స్టేషన్ ద్వారా ప్రయాణిస్తున్నారు. ప్రస్తుతం అమృత్ భారత్ పథకం కింద సుమారు రూ.714 కోట్లతో స్టేషన్ పునరాభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. విమానాశ్రయాలకు దీటుగా ప్రపంచ స్థాయి సౌకర్యాలు, మెట్రోతో అనుసంధానం, మల్టీ-లెవల్ పార్కింగ్ వంటివి ఈ ప్రాజెక్టులో భాగంగా ఉన్నాయి.ఈ ఆధునికీకరణ పనులు పూర్తయితే స్టేషన్ సామర్థ్యం మరింత పెరుగుతుందని, అప్పుడు మరిన్ని రైళ్లు, ప్రయాణికులకు సేవలు అందించగలమని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు. దీనితో సికింద్రాబాద్ దేశంలోనే టాప్-3 స్టేషన్లలో ఒకటిగా నిలిచే అవకాశం ఉందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఆధునికీకరణ పనులు 2026 చివరి నాటికి లేదా 2027 ప్రారంభంలో పూర్తవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

# మెంతులను ఇలా వాడారంటే..100 ఏళ్లు మీ గుండె సేఫ్..! తప్పక తెలుసుకోండి..



మెంతులతో ఆరోగ్యానికి అనేక లాభాలు ఉన్నాయని ఆయుర్వేద ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అనేక వైద్య పరిశోధనలు సైతం మెంతులు శరీరానికి ఎంతో మేలు చేస్తాయని చెబుతున్నాయి.. ముఖ్యంగా రాత్రి పూట నీళ్లల్లో నానబెట్టిన మెంతి నీరు ఉదయాన్నే తీసుకుంటే ఫలితాలు అధికంగా ఉంటాయట. అయితే, మెంతులను తినేందుకు ఇంతకంటే మెరుగైన, శక్తివంతమైన పద్ధతి మరొకటి ఉందని చెబుతున్నారు. అదేంటంటే.. మెంతులను నెయ్యిలో వేయించి పాలలో కలుపుకుని తీసుకోవడం వల్ల అమోఘమైన ఆరోగ్య రహస్యాలు దాగి ఉన్నాయని చెబుతున్నారు. ఆ సీక్రెట్స్ ఏంటో తెలియాలంటే పూర్తి వివరాల్లోకి వెళ్లాల్సిందే..ఉదయాన్నే ఖాళీ కడుపుతో గ్లాసుడు మెంతి నీళ్లు తాగితే ఆరోగ్యానికి మంచిదని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం చాలామంది ఇది ఫాలో అవుతున్నారు కూడా. పరగడుపునే ఈ నీటిని తీసుకోవటం వల్ల రక్తంలో షుగర్ లెవల్స్ కంట్రోల్ లో ఉంటాయి. బరువు తగ్గడానికి కూడా హెల్ప్ అవుతుంది. అయితే పోషకాహార నిపుణుల ప్రకారం.. అదే మెంతులను నెయ్యిలో వేయించి పాలలో కలుపుకుని తీసుకోవడం వల్ల ఊహించని లాభాలు ఉన్నాయని చెబుతున్నారు.

సాధారణంగా మెంతులు చేదుగా ఉంటాయి. కానీ వాటిని నెయ్యిలో దోరగా వేయించడం వల్ల ఆ చేదుదనం చాలా వరకు తగ్గిపోతుందట. పైగా వీటికి చక్కటి సువాసన వస్తుంది. ఇలా వేయించిన మెంతులకు మంచి రుచి పెరగడంతో పాటు ఆరోగ్య ప్రయోజనాలు రెట్టింపు అవుతాయని చెబుతున్నారు. మెంతులలో మంచి ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. దీనిని నెయ్యితో వేయించినప్పుడు నెయ్యిలోని ఆరోగ్యకరమైన కొవ్వులు జీర్ణక్రియను సులభతరం చేస్తాయి. ఇది మలబద్ధకం,



గ్యాస్ వంటి సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. వేయించిన మెంతులను పాలలో కలపడం వల్ల ప్రయోజనాలు మరింత పెరుగుతాయి. మెంతులు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో అద్భుతంగా పనిచేస్తాయి. నెయ్యితో కలిపి తీసుకున్నప్పుడు ఈ గుణం మరింత ప్రభావవంతంగా పనిచేస్తుందని నిపుణులు చెబుతున్నారు. మెంతులలో ఉండే యాంటీఆక్సిడెంట్లు శరీరంలో ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. నెయ్యితో కలిసినప్పుడు ఇవి రక్తంలోని చెడు కొలెస్ట్రాల్ ను నియంత్రించి, గుండె ఆరోగ్యాన్ని కాపాడతాయి. వేయించిన మెంతులు పాలతో కలపడం వల్ల అదనపు ప్రయోజనాలు అందుతాయి. పాలు కడుపులో మంట, అసౌకర్యం వంటి సమస్యలను తగ్గించి ఉపశమనాన్ని కలిగిస్తాయి. మెంతులు పేగుల ఆరోగ్యానికి మేలు చేస్తే, పాలు కడుపుకు చల్లదనాన్నిస్తాయి. ఈ రెండింటి కలయిక జీర్ణవ్యవస్థకు ఒక వరం లాంటిది. ఈ మిశ్రమం శరీరంలో పోషకాల శోషణను మెరుగుపరుస్తుంది. ఇందుకోసం ఒక టీస్పూన్ మెంతులను కొద్దిగా నెయ్యిలో దోరగా వేయించి, వాటిని ఒక గ్లాసు గోరువెచ్చని పాలలో కలుపుకుని రాత్రి పడుకునే ముందు లేదా ఉదయం తాగవచ్చు.

# రాత్రిపూట ఇలాంటి లక్షణాలు కనిపిస్తే బీ అలర్ట్ మీ కిడ్నీలు డేంజర్‌లో ఉన్నట్టే..!

రాత్రి నిద్ర లేస్తే.. విశ్రాంతి లేకపోవడం, నిద్రపోవడంలో ఇబ్బంది, తరచుగా మేల్కొవడం, నిద్ర నాణ్యత సరిగా లేకపోవడం వంటివి మూత్రపిండాల సంబంధిత సమస్యకు సంకేతం కావచ్చు అంటున్నారు వైద్యులు. నిద్రలో తరచుగా కండరాల నొప్పులు, ఆకస్మిక కుదుపులు అలసటను మాత్రమే సూచిస్తాయి. అవి కాల్షియం, ఎలక్ట్రోలైట్ అసమతుల్యతను సూచిస్తాయి. ఇది మూత్రపిండాల వైఫల్యం వల్ల సంభవించవచ్చు. మన శరీరాన్ని శుభ్రంగా ఉంచడానికి పనిచేసే మూత్రపిండాలు సరిగ్గా పనిచేయకపోతే.. దాని ఎఫెక్ట్ రాత్రిపూట స్పష్టంగా కనిపిస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. రాత్రిపూట మన శరీరంలో కనిపించే కొన్ని లక్షణాలు మన మూత్రపిండాలు ఆరోగ్యంగా లేవని చెప్పటానికి సంకేతాలు అంటున్నారు. అలాంటి లక్షణాల గురించి మనం తప్పక తెలుసుకోవాలి. ఎందుకంటే..ఒక్కోసారి మనం చేసే చిన్న నిర్లక్ష్యంతో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. కిడ్నీలు సరిగ్గా పనిచేసినప్పుడే మనం ఆరోగ్యం ఉండేందుకు దోహదపడుతుంది. లేదంటే..ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉంటున్నారు నిపుణులు. మీ కిడ్నీ సమస్యల్లో ఉందని చెప్పే కొన్ని సంకేతాలను ఇక్కడ చూద్దాం..మీరు ఉదయం లేదా అర్ధరాత్రి నిద్ర లేచినప్పుడు మీ కాళ్ళు వాపుగా ఉంటే జాగ్రత్తగా ఉండాలని వైద్య ఆరోగ్య నిపుణులు చెబుతున్నారను. ఎందుకంటే..మూత్రపిండాలు సరిగ్గా పనిచేయకపోతే ఇలాంటి పరిస్థితి ఎదురవుతుందని అంటున్నారు. రాత్రిపూట మేల్కొని తరచుగా బాత్రూమ్‌కు వెళ్లాల్సి రావడం కూడా సాధారణ విషయం కాదని అంటున్నారు. రెండు నుండి మూడు గంటలకు లేస్తుంటే, మూత్రపిండాలు సామర్థ్యాన్ని కోల్పోతున్నాయని సంకేతం కావచ్చు అంటున్నారు. రాత్రి బాగా నిద్రపోయినా మీరు రోజంతా తల తిరుగుతున్నట్లు, నిరంతరం అలసిపోయినట్లు, నీరసంగా ఉన్నట్లు అనిపిస్తే మీ మూత్రపిండాలు మీ శరీరం నుండి



టాక్సిన్స్ తొలగించలేకపోతున్నాయని అర్థం.మూత్రపిండాలు తమ పనిని చేయడంలో విఫలమైనప్పుడు శరీరంలో ద్రవం పేరుకుపోతుంది. ఇది ఊపిరితిత్తులకు చేరుతుంది. నిద్రలో ఈ సమస్య గుర్తించదగినదిగా మారుతుంది. రాత్రి నిద్ర లేస్తే.. విశ్రాంతి లేకపోవడం, నిద్రపోవడంలో ఇబ్బంది, తరచుగా మేల్కొవడం, నిద్ర నాణ్యత సరిగా లేకపోవడం వంటివి మూత్రపిండాల సంబంధిత సమస్యకు సంకేతం కావచ్చు అంటున్నారు వైద్యులు. నిద్రలో తరచుగా కండరాల నొప్పులు, ఆకస్మిక కుదుపులు అలసటను మాత్రమే సూచిస్తాయి. అవి కాల్షియం, ఎలక్ట్రోలైట్ అసమతుల్యతను సూచిస్తాయి. ఇది మూత్రపిండాల వైఫల్యం వల్ల సంభవించవచ్చు. ఆరోగ్య నిపుణులు, ఇతర అధ్యాయనాల ద్వారా అందిన సమాచారం మేరకు ఈ వివరాలు అందిస్తున్నాం.. ఇందులోని అంశాలు కేవలం అవగాహన కోసం మాత్రమే. ఏదైనా సందేహాలు,సమస్యలు ఉన్నా వైద్యులను సంప్రదించడమే మంచిదని గమనించగలరు.

# పైనాపిలే కదా అని తీసిపారేయకండి.. ప్రయోజనాలు తెలిస్తే షాకవుతారు!



పైనాపిల్ మీ చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. ఇందులోని విటమిన్ సి ముడుతలను తగ్గిస్తుంది. ఇది చర్మానికి హానిని కూడా నివారిస్తుంది. దీన్ని తీసుకోవడం వల్ల ముఖంలో మెరుపు పెరుగుతుంది. పైనాపిల్ శరీరంలో మంటను తగ్గించడం ద్వారా రోగనిరోధక శక్తిని పెంచుతుంది.. పైనాపిల్ పండు, జీర్ణక్రియకు సహాయం చేయడం నుండి రోగనిరోధక శక్తిని మెరుగుపరచడం వరకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. అలాగే, ఈ పండులో విటమిన్ సి, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. పరిశోధనలన్నీ క్యాన్సర్‌తో పోరాడటానికి, మీ చర్మం మెరుపును పెంచడంలో ఇది ఉపయోగపడుతుందని వెల్లడిస్తున్నాయి. దాని మరిన్ని ప్రయోజనాల గురించి తెలుసుకుందాం.

### పైనాపిల్ ప్రయోజనాలు ఏమిటి?

విటమిన్లు, ఖనిజాలతో సమృద్ధిగా: పైనాపిల్ పండులో విటమిన్లు, మినరల్స్ పుష్కలంగా ఉన్నాయి. ఇవి శరీరం రోజువారీ పనితీరుకు అవసరం. ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ న్యూట్రిషన్ అండ్ ఫుడ్ సైన్సెస్‌లో ప్రచురించబడిన పరిశోధన ప్రకారం, పైనాపిల్స్‌లో ఫైబర్, పొటాషియం, కాల్షియం కూడా తగిన మొత్తంలో ఉంటాయి. అందుకే దీన్ని తీసుకోవడం చాలా మంచిది. పైనాపిల్స్‌లో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి: మన శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో యాంటీఆక్సిడెంట్లు చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. కణాల నష్టంతో పోరాడుతుంది. అలాగే తీవ్రమైన వ్యాధుల నుండి రక్షిస్తుంది. అందుకే మీరు మీ ఆహారాన్ని మరింత ఆరోగ్యవంతంగా మార్చుకోవడానికి ఈ పండును తినవచ్చు. జీర్ణక్రియలో సహాయాలు: పైనాపిల్ పండు మరొక ప్రయోజనం ఏమిటంటే ఇది జీర్ణక్రియకు సహాయపడుతుంది. బరువు తగ్గడంలో కూడా సహాయపడుతుంది. ఫైబర్ అధికంగా ఉంటుంది: పైనాపిల్ ఫైబర్ గొప్ప మూలం. ఇది మలబద్ధకం సమస్యను తగ్గిస్తుంది. దీర్ఘకాలిక మలబద్ధకం సమస్యతో బాధపడే వారికి పైనాపిల్ పండు మంచి ఔషధం.

క్యాన్సర్ నివారించవచ్చు: పైనాపిల్ తినడం వల్ల క్యాన్సర్ నివారించవచ్చు. ఎందుకంటే చాలా క్యాన్సర్లు ఆక్సీకరణ ఒత్తిడి వల్ల వస్తాయి. పైనాపిల్‌లో ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించే గుణం ఉంది. తద్వారా క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అందుకే క్యాన్సర్ చికిత్సకు కూడా దీన్ని ఉపయోగిస్తారని అధ్యయనం చెబుతోంది. రోగనిరోధక శక్తిని పెంచుతుంది: పైనాపిల్ శరీరంలో మంటను తగ్గించడం ద్వారా రోగనిరోధక శక్తిని పెంచుతుంది. నొప్పిని తగ్గించే లక్షణాలు: పైనాపిల్‌లో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉన్నందున, ఇది నొప్పిని తగ్గిస్తుంది. ఫుడ్స్‌లో ప్రచురించబడిన ఒక అధ్యయనం ఆర్థరైటిస్ వల్ల కలిగే నొప్పికి చికిత్స చేయడానికి పైనాపిల్ మంచిదని పేర్కొంది. ఇది వెన్నునొప్పిని కూడా తగ్గిస్తుంది. ఇది ఋతు నొప్పిని కూడా తగ్గిస్తుంది. కానీ ఋతు చక్రం మొదటి మూడు రోజులలో తీసుకోవాలి. ఆరోగ్యకరమైన చర్మం మీ సొంతం అవుతుంది: పైనాపిల్ మీ చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. ఇందులోని విటమిన్ సి ముడుతలను తగ్గిస్తుంది. ఇది చర్మానికి హానిని కూడా నివారిస్తుంది. దీన్ని తీసుకోవడం వల్ల ముఖంలో మెరుపు పెరుగుతుంది. ఇందులోని అంశాలు కేవలం అవగాహన కోసం మాత్రమే. నిపుణుల సలహాలు, సూచనల మేరకు అందించడం జరిగింది. ఏవైనా సందేహాలు ఉంటే నిపుణులను సంప్రదించండి.

# ఉదయాన్నే జీలకర్ర నీరు తాగితే ఎలాంటి లాభాలు ఉంటాయో తెలిస్తే ఆశ్చర్యపోతారు!



జీలకర్ర వాడకం ఆరోగ్య ప్రయోజనాలలో కూడా చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ప్రముఖ డైటీషియన్ ఆయుషి యాదవ్ మాట్లాడుతూ.. రోజూ జీలకర్ర నీటిని తాగితే అద్భుతమైన ప్రయోజనాలు లభిస్తాయని చెప్పారు. జీర్ణవ్యవస్థను బలోపేతం చేయడానికి, దాని నీటిని తాగడం చాలా ముఖ్యం.. జీలకర్ర ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఇది అందరి ఇళ్లలో ప్రతి వంటగదిలో అందుబాటులో ఉంటుంది. జీలకర్ర అనేది ప్రతి వంటల్లో ఉపయోగిస్తుంటారు. దీని వల్ల ఆహారం రుచిగా ఉండడమే కాకుండా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. జీలకర్ర వాడకం ఆరోగ్య ప్రయోజనాలలో కూడా చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ప్రముఖ డైటీషియన్ ఆయుషి యాదవ్ మాట్లాడుతూ.. రోజూ జీలకర్ర నీటిని తాగితే అద్భుతమైన ప్రయోజనాలు లభిస్తాయని చెప్పారు. జీర్ణవ్యవస్థను బలోపేతం చేయడానికి, దాని నీటిని తాగడం చాలా ముఖ్యం. జీలకర్ర నీటిని ఖాళీ కడుపుతో తాగితే శరీరంలోని అనేక వ్యాధులు నయమవుతాయి. బలహీనమైన శరీరాన్ని బలోపేతం చేయడంలో ఇది చాలా ఉపయోగకరంగా ఉంటుంది. దీన్ని రోజూ తాగడం వల్ల రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. ఇందులో అనేక రకాల పోషకాలు ఉంటాయి. ఇవి శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. జీలకర్రలో యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయి. ఇది మీ వ్యాధిని నయం చేయడంలో మీకు చాలా సహాయపడుతుంది. మీరు ప్రతిరోజూ ఉదయం తప్పనిసరిగా జీలకర్ర నీటిని తాగాలి. ఇది శరీరంలో వాపులను తగ్గించడానికి కూడా పనిచేస్తుంది. ఇది మాత్రమే కాదు, వివిధ వ్యాధుల నుండి మిమ్మల్ని దూరంగా ఉంచడంలో ఇది చాలా సహాయపడుతుంది. అలాగే శరీరంలోని మురికిని తొలగిస్తుంది. చాలా మందికి శ్వాస సంబంధిత సమస్యలు చాలా ఉన్నాయి. మీరు ఖాళీ కడుపుతో ప్రతిరోజూ జీలకర్ర నీటిని తాగితే, మీరు శ్వాస ఆరోగ్యానికి సంబంధించిన అనేక సమస్యల నుండి బయటపడవచ్చు. శ్వాసకోశంలో ఉపశమనం కలిగించవచ్చు. మీరు దాని నీటిని చాలా వేడిగా తాగాల్సిన అవసరం లేదు. మీరు దానిని గోరువెచ్చగా మాత్రమే తాగాలి. జీలకర్ర నీటిలో యాంటీఆక్సిడెంట్ పదార్థాలు ఉన్నాయి. ఇది మీ శరీరాన్ని నిర్విషీకరణ చేయడంలో మీకు సహాయపడుతుంది. ప్రతిరోజూ ఉదయం నిద్రలేచిన తర్వాత ఈ నీటిని తాగాలి.

# కామెర్లు వచ్చినప్పుడు కళ్ళు, గోర్లు ఎందుకు పసుపు రంగులోకి మారుతాయి? కారణం ఇదే



కాలేయం చనిపోయిన కణాలను ఫిల్టర్ చేయలేనప్పుడు, రక్తంలో బిలిరుబిన్ పరిమాణం పెరగడం ప్రారంభమవుతుంది. ఇది శరీరంలోని ఇతర భాగాలకు చేరుకుంటుంది. దీనివల్ల శరీరంలోని అన్ని భాగాలలో పసుపు రంగు వస్తుంది. దీనిని కామెర్లు అంటారు. ఈ వ్యాధిని రక్త పరీక్ష.. కామెర్లు ఒక సాధారణ ఆరోగ్య సమస్య. ఇది సోకినప్పుడు శరీరంలో పసుపు రంగు కనిపించడం ప్రారంభమవుతుంది. దీని ప్రభావం కళ్ళ నుండి గోళ్ళ వరకు కనిపిస్తుంది. వాటిని విస్మరించడం వల్ల కొన్నిసార్లు శరీరంలో ప్రమాదకరమైన పరిస్థితి ఏర్పడుతుంది. కామెర్లు వచ్చిన తర్వాత కళ్ళు, గోళ్ళు ఎందుకు పసుపు రంగులోకి మారుతాయో తెలుసుకుందాం. ఈ లక్షణాలను చూసిన తర్వాత మనం ఎప్పుడు అప్రమత్తంగా ఉండాలి?

### అందుకే పసుపు రంగు కనిపిస్తుంది

ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం.. బిలిరుబిన్ ఎర్ర రక్త కణాలలో కనిపిస్తుంది. శరీరంలో అప్పుడప్పుడు ఎర్ర రక్త కణాలు ఏర్పడి చనిపోతాయి. కాలేయం చనిపోయిన కణాలను ఫిల్టర్ చేయడానికి పనిచేస్తుంది. కాలేయం చనిపోయిన కణాలను ఫిల్టర్ చేయలేనప్పుడు, రక్తంలో బిలిరుబిన్ పరిమాణం పెరగడం ప్రారంభమవుతుంది. ఇది శరీరంలోని ఇతర భాగాలకు చేరుకుంటుంది. దీనివల్ల శరీరంలోని అన్ని భాగాలలో పసుపు రంగు వస్తుంది. దీనిని కామెర్లు అంటారు. ఈ వ్యాధిని రక్త పరీక్ష ద్వారా గుర్తిస్తారు.

### ఈ లక్షణాలు కనిపిస్తాయి

కళ్ళు, గోర్లు, మూత్రం పసుపు రంగులోకి మారడం
చర్మం పసుపు రంగులో కనిపిస్తుంది
ఆకలి లేకపోవడం
వికారం
ఏమీ తినాలని అనిపించకపోవడం
కడుపు నొప్పి
అలసిపోయినట్లు అనిపిస్తుంది
బరువు తగ్గడం
ప్రారంభ దశలో వైరల్ జ్వరం సమస్య
చలిగా అనిపిస్తుంది
కడుపు నొప్పి
టారీ బ్లాక్ కలర్ స్టూల్స్
ఇలా మిమ్మల్ని మీరు రక్షించుకోండి:
కలుషితమైన ఆహారాన్ని నివారించండి
మద్యం సేవించవద్దు
మరిగించిన నీరు తాగాలి.
నూనె పదార్థాలను నివారించండి
కారంగా ఉండే ఆహారానికి దూరంగా ఉండండి
భోజనం చేసేటప్పుడు శుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించండి.
మీకు ఏవైనా లక్షణాలు కనిపిస్తే వైద్యుడిని సంప్రదించండి
కామెర్లు కారణంగా వచ్చే సమస్యలు
హెపటైటిస్ ఎ, బి, సి, డి, ఇ వంటి వైరల్ ఇన్ఫెక్షన్ల వల్ల ఈ సమస్య రావచ్చు.
పారాసెటమాల్ వంటి కొన్ని మందుల అధిక మోతాదు వల్ల ఇది జరగవచ్చు.
విషపూరిత పుట్టగొడుగుల వంటి విష పదార్థాల వినియోగం వల్ల ఇది జరగవచ్చు.
ఈ పరిస్థితి గిల్బర్ట్ సిండ్రోమ్, డుబిన్-జాన్సన్ సిండ్రోమ్ మొదలైన పుట్టుకతో వచ్చే రుగ్మతల వల్ల తలెత్తవచ్చు.
పిత్త వాహిక లేదా పిత్తాశయ రాళ్ళు అడ్డుకోవడం వల్ల కూడా కామెర్లు వస్తాయి.
కాలేయ క్యాన్సర్

# బ్యాంకులో రూ.7.40 కోట్ల నకిలీ నోట్లు.. షాకవుతున్న ఖాతాదారులు

సాధారణంగా నకిలీ నోట్లు ప్రజల వద్ద చలామణిలో ఉంటాయి. కానీ ఓ బ్యాంకులోనే భారీగా దొంగ నోట్లు బయటపడడం సంచలనం రేపుతోంది. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా రూ.7 కోట్లకు పైగా ఫేక్ కరెన్సీని గుర్తించారు. ఉత్తర్‌ప్రదేశ్ సహారన్‌పుర్‌లోని పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లోని కరెన్సీ చెస్ట్‌లో దాదాపు రూ.7.40 కోట్ల నకిలీ నోట్లు ఉన్నట్లు గుర్తించారు. ఇది ఇంకా పెరిగే అవకాశం ఉంది. ఇందుకు సంబంధించి ముగ్గురు బ్యాంకు అధికారులతో పాటు ఓ హౌస్‌కీపర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి పంజాబ్ నేషనల్ బ్యాంక్ చర్యలు చేపట్టింది. పీఎన్‌బీ సీనియర్ డివిజనల్ మేనేజర్ రవి కుమార్ కేన్, కరెన్సీ చెస్ట్ మేనేజర్లు సుశీల్ శర్మ, అమిత్ కుమార్‌లను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించింది.ఆగస్టు 5న గ్రాచీదీ కరెన్సీ చెస్ట్ నుంచి జైపూర్ చెస్ట్‌కు దాదాపు రూ. 11.50 కోట్ల విలువైన నగదును తరలించినప్పుడు ఈ విషయం వెలుగులోకి వచ్చింది. జైపూర్ చెస్ట్‌లో నగదు లెక్కింపు సమయంలో రూ. 4,30,900 తక్కువగా ఉన్నట్లు గుర్తించి, గ్రాచీదీ మీరట్ అధికారులకు సమాచారం అందించారు. ఆ తర్వాత, ఈ వ్యవహారంపై విచారణ జరిపేందుకు బ్యాంకు చీఫ్ మేనేజర్, దర్యాప్తు అధికారి అయిన అరుణ్ కుమార్ చౌబేను సహరాన్‌పూర్‌కు పంపారు. కరెన్సీ చెస్ట్‌లో పార్ట్-టైమ్ హౌస్‌కీపర్‌గా పనిచేస్తున్న విశాల్ కుమార్ ఈ పనిలో ప్రమేయం కలిగి ఉన్నట్లు విచారణలో తేలింది. వెండి ధరలు ఇక చేతికి చిక్కవు.. పతనం కథ ముగిసి భారీ ర్యాలీ తప్పదంటున్న నిపుణులు.. కారణమిదే.. కరెన్సీ నోట్ల కట్టలను సర్దడం లేదా అమర్చడం వంటి బాధ్యత విశాల్‌కు అప్పగించారు. అతను నోట్ల కట్టల నుంచి నగదును దొంగిలిస్తున్నట్లు కెమెరాల్లో కూడా రికార్డయింది. నగదు తక్కువగా ఉన్నట్లు గుర్తించిన తర్వాత, బ్యాంకు ఆగస్టు 9న కరెన్సీ చెస్ట్‌పై సమగ్ర ఆడిట్‌ను ప్రారంభించింది. నోట్ల లెక్కింపు, పరిశీలన సమయంలో దర్యాప్తు అధికారులు భారీ మొత్తంలో నకిలీ కరెన్సీని గుర్తించారు. సోమవారం నాడు గుర్తించిన నకిలీ నోట్ల విలువ సుమారు రూ. 7.40 కోట్లుగా అంచనా వేశారు. కానీ విచారణ సాగుతున్న నకిలీ నోట్లు బయటపడుతున్నాయి. ఫేక్ కరెన్సీ రూ. 17 కోట్లకు చేరుకోవచ్చని సమాచారం. బ్యాంకు ద్వారా కరెన్సీకి సంబంధించిన సమగ్ర ఆడిట్ ఇంకా కొనసాగుతోంది. విచారణ సమయంలో సీనియర్ డివిజనల్




మేనేజర్ రవి కుమార్ కాన్సే, కరెన్సీ చెస్ట్ మేనేజర్ సుశీల్ కుమార్, యమునానగర్-జగాద్రి (హర్యానా) కరెన్సీ చెస్ట్ మేనేజర్ అమిత్ కుమార్ పేర్లు తెరపైకి వచ్చాయి. దర్యాప్తు అధికారులు ఈ విషయంపై వారి నుంచి సమాచారాన్ని సేకరించారు. సస్పెండ్ చేసిన ప్రమేయం ఎంతవరకు ఉంది. నకిలీ నోట్లు కరెన్సీ చెస్ట్‌కు ఏ విధంగా చేరాయి అనే విషయాలు విచారణ పూర్తయిన తర్వాతే వెల్లడవుతాయి. ఇదిలా ఉండగా జైపూర్‌కు పంపిన ఒక కరెన్సీ సరుకులో లక్షల రూపాయల లోటు బయటపడటంతో, పార్ట్‌టైమ్ హౌస్‌కీపర్ విశాల్ కుమార్‌పై చర్య తీసుకున్నారు. బ్యాంకు అంతర్గత విచారణ, సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా, అతను నోట్ల కట్టల నుంచి నగదును తీసివేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. హౌస్‌కీపర్ దొంగతనానికీ, కరెన్సీ చెస్ట్‌లో కోట్ల రూపాయల నకిలీ కరెన్సీ దొరకడానికీ మధ్య ఏదైనా సంబంధం ఉందా, లేదా ఈ రెండు సంఘటనలకు సంబంధం లేదా అనే విషయాన్ని పోలీసులు ఇప్పుడు నిర్ధారించడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి ప్రత్యేక విచారణ బృందాన్ని ఏర్పాటు చేసినట్లు డీఐజీ అభిషేక్ చెప్పారు. ఈ నకిలీ కరెన్సీని ఎవరు చేర్చారనే విషయంపై దర్యాప్తు కొనసాగుతోందని పేర్కొన్నారు. డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

# గుడ్ న్యూస్ చెప్పిన ఫోన్ పే.. నెట్ లేకుండా యూపీఐ పేమెంట్ చేయవచ్చు..

ప్రస్తుతం దేశంలో యూపీఏ పేమెంట్స్ భారీగా పెరిగాయి. రూ.5 నుంచి రూ.లక్ష వరకు యూపీఐ పేమెంట్ చేస్తున్నారు. చాయ్ తాగినా యూపీఐ పేమెంట్, చిప్స్ ప్యాకెట్స్ కొన్నా యూపీఐ పేమెంట్ చేస్తున్నారు. అయితే ఈ యూపీఏ పేమెంట్ చేయాలంటే కచ్చితంగా స్మార్ట్ ఫోన్ కావాలి. అంతే కాదు నెట్ కూడా ఉండాలి. అయితే ఫీచర్ ఫోన్లలో నెట్ ఉండదు. అంతే కాదు అందులో యూపీఐ యాప్స్ కూడా డౌన్ లోడ్ చేసుకోలేరు. ఈ నేపథ్యంలో ప్రముఖ యూపీఐ పేమెంట్ యాప్ ఫోన్ పే కీలక ప్రకటన చేసింది. ఇంటర్నెట్ లేకపోయిన యూపీఐ పేమెంట్ చేసేలా, అదీ కూడా ఫీచర్ ఫోన్లలో తీసుకురానుంది. ఇందుకు సంబంధించి అధికారిక ప్రకటన చేసింది. ఇక నుంచి ఫీచర్ ఫోన్లను ఉపయోగించేవారు ఇంటర్నెట్ కనెక్షన్ లేకుండా యూపీఐ పేమెంట్స్ చేసుకోవచ్చని ఫోన్ పే ప్రకటించింది. దీని ద్వారా దేశంలో 20 కోట్లకుపైగా ఫీచర్ ఫోన్ వినియోగదారులకు యూపీఐ సౌకర్యాలు అందించిన ఫ్లాట్‌ఫామ్‌గా ఫోన్ పే చరిత్ర సృష్టించనుంది. ఫోన్ పే యూపీఐ 123పే సేవల ద్వారా 2జీ కనెక్టివిటీ తక్కువగా ఉన్న ప్రాంతాల్లోని ప్రజలకు యూపీఐ చెల్లింపులను సులభతరం చేసేందుకు ఫోన్ పే ఈ నిర్ణయం తీసుకుంది. ఫీచర్ ఫోన్లలో యూపీఐ చెల్లింపుల కోసం ఫోన్ పే సొంత సాంకేతికతతో పాటు ఎస్ఎంఎస్ ఆధారిత వ్యవస్థను ఉపయోగించనుంది. భవిష్యత్తులో బంగారం ధర తులం రూ. 15 లక్షలకు.. సామాన్యుల పసిడి ఆశలపై బాంబు పేల్చిన బిలియనీర్ థామస్ కాప్లాన్ .. అయితే ఇంటర్నెట్ లేకుండా యూపీఐ పేమెంట్స్ చేసే విధంగా ఉండేందుకు నోకియా, హెచ్ఎండీ, లావా, ఐటెల్ వంటి తయారీ కంపెనీలతో ఫోన్ పే భాగస్వామ్యం ఏర్పచుకుంది. యూపీఐ 123పే ద్వారా ఫీచర్ ఫోన్లకు యూపీఐ పేమెంట్స్ సౌకర్యాన్ని విస్తరించే అవకాశం ఉంది. కేవలం స్మార్ట్‌ఫోన్లకే కాకుండా ఫీచర్ ఫోన్లకు కూడా యూపీఐ సౌకర్యాలను విస్తరించాలనే ఉద్దేశంతో ఈ ప్రయత్నం చేస్తున్నట్లు ఫోన్ పే తెలిపింది. 30 కోట్ల మందిని డిజిటల్ చెల్లింపుల పరిధిలోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు వివరించింది. పర్సనల్ టూ పర్సనల్ నగదు ట్రాన్సాక్షన్లు, పీర్ టు మర్చంట్ పేమెంట్స్, కెమెరాలతో కూడిన ఫీచర్ ఫోన్లలో క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా చెల్లింపులు చేసే అవకాశం ఉంది. బ్యాంక్ ఖాతా బ్యాలెన్స్ చెక్ చేయడం, లావాదేవీల చరిత్రను యాక్సెస్ చేయడం లాంటివి చేయవచ్చని ఫోన్ పే తెలిపింది. ఆ కంపెనీ వినియోగదారులకు సహాయం అందించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హెల్ప్ లైన్ సేవలను కూడా అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇంగ్లీష్‌తో పాటు మొత్తం 12 భారతీయ భాషల్లో ఈ సేవలు కొనసాగిస్తోంది. అయితే రాబోయే రోజుల్లో యుటిలిటీ బిల్లులు, మొబైల్ రీఛార్జ్ సేవలను కూడా ఇందులో చేర్చాలని భావిస్తోంది.




జులై నాటికి ఫోన్‌పేకు 71.5 కోట్లకుపైగా నమోదిత వినియోగదారులు ఉండగా.. 5 కోట్లకుపైగా వ్యాపారులు ఫోన్ పే సౌండ్ బాక్స్ లు వాడుతున్నారు. నోకియా, హెచ్ఎండీ, లావా, ఐటెల్ ఫీచర్ ఫోన్లను కొనుగోలు చేస్తే అందులో ఫోన్ పే యాప్ ఇన్ బిల్ట్ గా వస్తుంది. డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

# సుభాష్ చంద్రకు ఎన్‌సిఎల్‌టి షాక్.. రూ. 6.25 కోట్ల సెటిల్‌మెంట్‌పై స్టే..కారణం ఏంటంటే..

ఎస్సెల్ గ్రూప్ వ్యవస్థాపకుడు, మీడియా దిగ్గజం సుభాష్ చంద్రకు నేషనల్ కంపెనీ లా అప్పీలేట్ ట్రిబ్యునల్ ఐదుగురు సభ్యుల ప్రత్యేక ధర్మాసనం నుండి షాక్ తగిలింది. అంగీకరించిన రూ. 22,006.57 కోట్ల క్లెయిమ్‌లకు గాను కేవలం రూ. 6.25 కోట్లు చెల్లించి తన వ్యక్తిగత దివాలా ప్రక్రియలను ముగించుకోవడానికి చీజూ ఏకసభ్య ధర్మాసనం ఆగస్టు 25న ఇచ్చిన తీర్పు అమలుపై ట్రిబ్యునల్ స్టే విధించింది. అంతేకాకుండా చంద్ర తన ఆస్తులను (ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా) విక్రయించడం.. బదిలీ చేయడం లేదా అన్యాక్రాంతం చేయకూడదని ఆదేశించింది. ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్ పిటిషన్‌ను అనుసరించి 2024లో సుభాష్ చంద్రపై వ్యక్తిగత దివాలా ప్రక్రియలు ప్రారంభమయ్యాయి. ఎస్సెల్ గ్రూప్ అనుబంధ సంస్థలు తీసుకున్న భారీ రుణాలకు చంద్ర వ్యక్తిగత హామీదారుగా సంతకం చేశారు. ఈ కేసులో ప్రధాన వివాదాస్పద అంశాలను పరిశీలించినట్లయితే.. చంద్ర సంతకం చేసిన రూ. 22,000 కోట్ల హామీలకుగాను రుణదాతలకు కేవలం రూ. 6.25 కోట్లు (చెల్లించాల్సిన మొత్తంలో నామమాత్రపు శాతం) చెల్లించేలా మునుపటి ట్రిబ్యునల్ పునర్వ్యవస్థీకరణ ప్రణాళికను ఆమోదించింది. ఈ రికవరీ మొత్తం అసాధారణంగా తక్కువగా ఉండటంతో బ్యాంకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. 2017, 2018 లలో సమర్పించిన నికర విలువ ధృవీకరణ పత్రాల ప్రకారం సుభాష్ చంద్ర ఆస్తుల విలువ వరుసగా రూ. 45,888 కోట్లు మరియు రూ. 40,562 కోట్లుగా ఉంది. అయితే, దివాలా ప్రక్రియ సమయంలో ఆయన చూపించిన ప్రస్తుత ఆస్తుల విలువ కేవలం రూ.



31.79 కోట్లు మాత్రమే కావడం రుణదాతలను ఆశ్చర్యపరిచింది. ఈ తిరిగి చెల్లింపు ప్రణాళికకు 80.814% ఓటింగ్ లభించగా, బ్యాంకులు 19.186% ఓట్లతో వ్యతిరేకించాయి. అయితే, ప్రణాళికకు మద్దతుగా పోలైన ఓట్లలో 61.78% ఓట్లు చంద్రకు చెందిన అనుబంధ సంస్థల నుంచే వచ్చాయని బ్యాంకులు ఆరోపించాయి. సుభాష్ చంద్ర రూ. 22 వేల కోట్ల అప్పు నిజంగానే మాఫీ అయ్యిందా.. మొత్తం రూ. 6.5 కోట్లకు ఎందుకు తగ్గింది.. మునుపటి రెండు సభ్యుల ధర్మాసనం ఇచ్చిన చీలిక తీర్పు మరియు తదనంతర ఉత్తర్వులలో స్పష్టమైన మెజారిటీ అభిప్రాయం లేకపోవడంతో, ప్రెసిడెంట్ జస్టిస్ (రిటైర్డ్) అనుపిందర్ సింగ్ గ్రెవాల్ నేతృత్వంలోని ప్రత్యేక ధర్మాసనం కేసును మళ్లీ మొదటి నుండి విచారించాలని నిశ్చయించింది. గతంలో చంద్రకు లభించిన వెసులుబాటు నిలిచిపోవడంతో పాటు, ఆయన ఆర్థిక స్థితిపై, గతంలో ఉన్న ఆస్తులు ఏమయ్యాయనే దానిపై ఫోరెన్సిక్ దర్యాప్తు జరపాలన్న నిబంధన మళ్లీ తెరపైకి వచ్చింది. భారత దివాలా మరియు బ్యాంక్రప్సీ కోడ్ కింద వ్యక్తిగత హామీదారుల బాధ్యత, రుణదాతల రికవరీ హక్కులపై రాబోయే రోజుల్లో ఇచ్చే తీర్పు అత్యంత కీలకమైన మైలురాయిగా మారనుంది.

# ఎన్పీఎస్ ఛార్జీలను సవరించిన పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ

పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ నేషనల్ పెన్షన్ సిస్టమ్ ఛీూా లైట్ కింద ఉన్న అన్ని పథకాలకు సంబంధించి పాయింట్ ఆఫ్ ప్రెజెన్స్ కు వర్తించే ఛార్జీల విధానాన్ని సవరించింది. ఈ కొత్త ఛార్జీలు అక్టోబర్ 1, 2026 నుంచి అమల్లోకి రానున్నాయి. సవరించిన ఫ్రేమ్‌వర్క్ ప్రకారం ఎన్పీఎస్ చందాదారులు ప్రతి ఒకేసారి రూ. 200 ఆన్‌బోర్డింగ్ ఛార్జీని చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని సెంట్రల్ రికార్డ్‌కీపింగ్ ఏజెన్సీలు యూనిట్లను రద్దు చేయడం ద్వారా ప్రతి త్రైమాసికానికి రూ. 50 చొప్పున వసూలు చేసుకునే అవకాశం కల్పించింది. ఆన్‌బోర్డింగ్ పూర్తయిన త్రైమాసికం తర్వాతి నెలలో ఈ మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది. పూర్తిగా డిజిటల్, ఫేస్ టూ పేస్ ప్రక్రియ ద్వారా ఆన్‌బోర్డ్ చేయబడిన చందాదారులకు, గ్రాశీూ కోసం గ్రాఖీ=ణూా నిర్ధారించిన ఛార్జీని బట్టి, రూ. 100 వరకు ఆన్‌బోర్డింగ్ ఛార్జీ తగ్గించవచ్చని పేర్కొంది. వార్షిక ఖర్చు కింద అనేది నిర్వహణలో ఉన్న ఆస్తులపై 0.20 శాతం వార్షిక ఛార్జీ వసులు చేస్తారు. దీనిని ఛీూఎ ద్వారా సర్దుబాటు చేసి, త్రైమాసిక ప్రాతిపదికన గ్రాశీూలకు చెల్లిస్తారు. పని చేయని ఖాతాలు మినహా అన్ని పథకాలకు ఈ ఛార్జీ వర్తిస్తుంది. పని చేయని ఖాతాకు ఛార్జీ విధించబడదని సర్క్యులర్ పేర్కొంది. ఒక సంవత్సరం కనీసం సొమ్మును ఎన్పీఎస్ ఖాతాలో జమ చేయకుంటే ఆ ఖాతా స్తంభించి పోతుంది. భవిష్యత్తులో బంగారం ధర తులం రూ. 15 లక్షలకు.. సామాన్యుల పసిడి ఆశలపై బాంబు పేల్చిన బిలియనీర్ థామస్ కాప్లాన్ .. ఉదాహరణకు రూ. 10 లక్షల ూాఖీ ఉన్న ఒక ఖాతాకు సంవత్సరానికి రూ.2000 వార్షిక ఫీజును వసూలు చేస్తారు. దీనికి జీఎస్టీ అదనంగా ఉంటుంది. ఈ ఛార్జీ ఛీూఎ లో సర్దుబాటు చేస్తారు కాబట్టి, పెట్టుబడిదారులు దీనిని తమ బ్యాంకు ఖాతా నుండి ప్రత్యేక డెబిట్‌గా కాకపోవచ్చని చెబుతున్నారు. గ్రాఖీ=ణూా తన డిజిటల్ ఛానెల్‌లను ఉపయోగించే పెట్టుబడిదారుల కోసం ఒక ముఖ్యమైన వ్యత్యాసాన్ని కూడా స్పష్టం చేసింది. వ- ద్వారా చేరి, ఆ తర్వాత లేదా ద్వారా విరాళాలు ఇచ్చే చందాదారులు ఛార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదు. అయితే, ప్రారంభంలో ద్వారా చేరిన చందాదారులు, ఆ తర్వాత లేదా ద్వారా విరాళాలు ఇచ్చినా కూడా, నిర్దేశించిన గ్రా ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. సవరించిన ఛార్జీలను తమ వెబ్‌సైట్‌లలో బహిరంగంగా ప్రదర్శించాలని, అలాగే డిజిటల్ ఆన్‌బోర్డింగ్ ప్రక్రియ సమయంలో చందాదారులకు వాటిని స్పష్టంగా




వెల్లడించాలని రెగ్యులేటర్ ఆదేశించింది. 2026-27 ఆర్థిక సంవత్సరం మూడవ త్రైమాసికం నుంచి ఛార్జీల తగ్గింపు కోసం సవరించిన విధానాన్ని జ=ూాలు అమలు చేస్తాయని గ్రాఖీ=ణూా తెలిపింది. డిస్క్లైమర్ ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

# ఫిట్‌నెస్ విషయంలో నో కాంప్రమైజ్.. ఆటగాళ్ల ఎంపికలో బీసీసీఐ కొత్త పాలసీ




భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఆటగాళ్ల ఎంపిక విషయంలో, ముఖ్యంగా వారి ఫిట్‌నెస్‌కు సంబంధించి అత్యంత కఠినమైన వైఖరిని అవలంబించడం ప్రారంభించింది. గాయపడిన ఆటగాళ్ల నిర్వహణపై ఇటీవలి కాలంలో తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న నేపథ్యంలో భవిష్యత్తులో అలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పటిష్ఠమైన చర్యలు చేపట్టింది. ఇకపై ఒక ఆటగాడిని జట్టులోకి ఎంపిక చేయాలంటే, అతని ఫిట్‌నెస్‌పై 100 శాతం కాదు, ఏకంగా 200 శాతం నమ్మకం ఉంటేనే తుది నిర్ణయం తీసుకోవాలని పాలసీని మార్చింది.ఇటీవల ఆఫ్ఘనిస్థాన్‌తో జరగనున్న 3 మ్యాచ్‌ల టీ20 సిరీస్ కోసం ప్రకటించిన జట్టులో ఈ కొత్త విధానం స్పష్టంగా కనిపించింది. ఈ జట్టులో జస్ప్రీత్ బుమ్రా, నితీశ్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, హర్షిత్ రాణా వంటి ఆటగాళ్ల పేర్ల పక్కన ఒక ఆస్టరిస్క్ గుర్తును చేర్చారు. దీని అర్థం, వారి ఎంపిక వారి ఫిట్‌నెస్‌పై ఆధారపడి ఉంటుందని బీసీసీఐ స్పష్టం చేసింది. గత కొద్ది నెలలుగా గాయాలతో సతమతమవుతున్న ఆటగాళ్లను పూర్తి ఫిట్‌నెస్ సాధించకుండానే జాతీయ జట్టులోకి ఎంపిక చేయడం, వారు ఒకటి రెండు మ్యాచ్‌లు ఆడి మళ్లీ గాయపడటంతో బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ) పనితీరుపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలోనే బోర్డు ఈ కొత్త నిర్ణయం తీసుకుంది.క్రిక్‌బజ్ కథనం ప్రకారం.. “ఒక ఆటగాడి లభ్యతపై 100 శాతం కాదు, 200 శాతం విశ్వాసం వచ్చాకే అతడిని విడుదల చేయాలని యాజమాన్యం భావిస్తోంది” అని ఈ విధానం గురించి తెలిసిన ఒక అధికారి పేర్కొన్నారు.ఈ కొత్త విధానంపై సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ హెడ్ వీవీఎస్ లక్ష్మణ్ స్పందిస్తూ.. ఎంపిక వ్యవహారాల్లో పూర్తి పారదర్శకత తీసుకురావడమే తమ లక్ష్యమని వివరించాడు. “జాతీయ సిరీస్‌లలో పాల్గొనడానికి తాము ఇంకా సిద్ధంగా లేమని ఆటగాళ్లు అర్థం చేసుకుంటారు. ఈ కమ్యూనికేషన్ ఆటగాళ్లకు, జట్టుకు మధ్య సజావుగా సాగుతోంది. ఫిట్‌నెస్ రిపోర్టులు, ఎంపిక ప్రక్రియలో బీసీసీఐ పారదర్శకతను పాటిస్తోంది. ఒకవేళ ఆటగాళ్లు ఫిట్‌నెస్ టెస్టులో విఫలమైతే, వారి స్థానంలో ఎవరిని తీసుకోవాలనే దానిపై సెలక్టర్లకు స్పష్టత ఉంటుంది. ఇది చాలా ప్రాథమికమైన విషయం” అని లక్ష్మణ్ తెలిపాడు.ఆటగాళ్ల పేర్ల పక్కన ఆస్టరిస్క్ గుర్తు ఎందుకు చేర్చారో బీసీసీఐ కార్యదర్శి దేవాజిత్ సైకియా కూడా వివరించారు. సాధారణంగా అంతర్జాతీయ సిరీస్‌లకు 3-4 వారాల ముందే జట్లను ఎంపిక చేస్తామని, ఎంపిక తేదీ నాటికి ఒక ఆటగాడు ఫిట్‌గా లేకపోయినా, సిరీస్ ప్రారంభమయ్యే నాటికి కోలుకునే అవకాశం ఉంటుందని అన్నారు. “ఆ సమయంలో అతను పూర్తి ఫిట్‌నెస్ సాధిస్తే, జట్టులోకి తీసుకుంటాం. అందుకే వారిని పూర్తిగా తిరస్కరించకుండా, ఫిట్‌నెస్‌కు లోబడి ఎంపిక చేస్తున్నాం” అని సైకియా పేర్కొన్నారు.ఆఫ్ఘనిస్థాన్ సిరీస్ విషయానికొస్తే, బుమ్రా, నితీశ్ కుమార్ రెడ్డి సెప్టెంబర్ 13న ఢిల్లీలో జరిగే తొలి మ్యాచ్ నాటికి పూర్తి ఫిట్‌నెస్‌తో అందుబాటులోకి వస్తారని అంచనా. అయితే, హర్షిత్ రాణా, వాషింగ్టన్ సుందర్‌ల విషయంలో ఇంకా స్పష్టత రాలేదని, సీఓఈ ఎలాంటి రిస్క్ తీసుకునేందుకు సిద్ధంగా లేదని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ కొత్త పాలసీతో ఆటగాళ్ల దీర్ఘకాలిక కెరీర్‌కు మేలు చేయడంతో పాటు జట్టు స్థిరత్వాన్ని కాపాడాలని బీసీసీఐ భావిస్తోంది.

# దులీప్ ట్రోఫీ: రాణించిన వైభవ్ సూర్యవంశీ, కిషన్... ఫైనల్లోకి దూసుకెళ్లిన ఈస్ట్ జోన్



దులీప్ ట్రోఫీ సెమీ ఫైనల్లో ఈస్ట్ జోన్ ఘన విజయం సాధించింది. డిఫెండింగ్ ఛాంపియన్ సెంట్రల్ జోన్‌ను నాలుగు వికెట్ల తేడాతో మట్టికరిపించి ఫైనల్లోకి అడుగుపెట్టింది. కెప్టెన్ ఇషాన్ కిషన్ బాధ్యతాయుత ఇన్నింగ్స్‌తో జట్టును విజయతీరాలకు చేర్చాడు.159 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన ఈస్ట్ జోన్‌కు యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ (43 బంతుల్లో 43) మెరుపు ఆరంభాన్ని అందించాడు. అయితే, సెంట్రల్ జోన్ బౌలర్ హర్ష్ దూబె నాలుగు వికెట్లు పడగొట్టి ఈస్ట్ జోన్‌పై ఒత్తిడి పెంచాడు. ఈ దశలో సంయమనంతో ఆడిన కెప్టెన్ ఇషాన్ కిషన్ (41 బంతుల్లో 39 నాటౌట్) జట్టుకు విజయాన్ని ఖరారు చేశాడు. అతనికి మహమ్మద్ షమీ (8 నాటౌట్) సహకరించాడు.అంతకుముందు, సెంట్రల్ జోన్ తమ రెండో ఇన్నింగ్స్‌లో కేవలం 158 పరుగులకే కుప్పకూలింది. ఈస్ట్ జోన్ బౌలర్లు ముకేశ్ కుమార్ 4 వికెట్లతో, మహమ్మద్ షమీ 3 వికెట్లతో ప్రత్యర్థి బ్యాటింగ్ లైనప్‌ను దెబ్బతీశారు. కాగా, ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో ఇరు జట్లు 266 పరుగుల వద్ద సమానంగా నిలవడం విశేషం. ఈ విజయంతో, గత ఏడాది ఛాంపియన్‌ను టోర్నీ నుంచి నిష్క్రమింపజేసి, ఈస్ట్ జోన్ ఫైనల్‌కు దూసుకెళ్లింది.

# పాక్ క్రికెట్‌లో ప్రకంపనలు.. సెలక్షన్ కమిటీకి మిస్బా ఉల్ హక్ రాజీనామా



పాకిస్థాన్ క్రికెట్‌లో సంక్షోభం మరింత ముదు రుతోంది. ఇంగ్లండ్ తో జరుగుతు న్న టెస్టు సిరీస్‌లో ఘోర పరాజయాల నేపథ్యం లో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) తీసు కున్న కఠిన చర్య లపై అసంతృప్తితో, మాజీ కెప్టెన్ మిస్బా ఉల్ హక్ పురుషుల సెలక్షన్ కమిటీ సభ్యత్వానికి రాజీనామా చేశాడు. ఈ అనూహ్య పరిణామం పాక్ క్రికెట్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.ఇంగ్లండ్‌తో జరుగుతున్న మూడు టెస్టుల సిరీస్‌ను పాకిస్థాన్ ఇప్పటికే 0-2తో కోల్పోయింది. లార్డ్స్‌లో జరిగిన రెండో టెస్టులో 194 పరుగుల తేడాతో ఓటమి పాలైన తర్వాత, పీసీబీ జట్టులో భారీ మార్పులకు శ్రీకారం చుట్టింది. ఏకంగా ఏడుగురు ఆటగాళ్లను జట్టు నుంచి తప్పించింది. మహమ్మద్ రిజ్వాన్, ఇమామ్ ఉల్ హక్, సల్మాన్ అఘా, అలీ ఉస్మాన్, అమీర్ జమాల్, అవాజ్ జాఫర్, ఖుర్రం షాజాద్‌లను రిలీజ్ చేసింది. వీరి స్థానంలో ఏడుగురు కొత్తవారిని జట్టులోకి తీసుకుంది.ఈ మార్పులు ఆటగాళ్లకే పరిమితం కాలేదు. జట్టు పేలవ ప్రదర్శనకు బాధ్యత వహింపజేస్తూ, హెడ్ కోచ్ సర్ఫరాజ్ ఖాన్, బౌలింగ్ కోచ్ ఉమర్ గుల్‌లను కూడా బాధ్యతల నుంచి తప్పించింది. వీరి స్థానంలో వైట్-బాల్ హెడ్ కోచ్ మైక్ హెస్సన్, యాష్లే నోఫ్కేలకు మిగిలిన టూర్‌కు బాధ్యతలు అప్పగించింది. కొద్ది రోజుల క్రితమే టెస్ట్ కెప్టెన్సీ నుంచి షాన్ మసూద్‌ను తప్పించి, బాబర్ అజామ్‌కు తిరిగి పగ్గాలు అప్పగించిన విషయం తెలిసిందే.పీసీబీ తీసుకున్న ఈ అసాధారణ నిర్ణయాల పట్ల తీవ్ర అసంతృప్తికి గురైన మిస్బా ఉల్ హక్, సెలక్షన్ కమిటీ నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నాడు. ఈ ఏడాది మార్చిలో ఆకిబ్ జావేద్, సర్ఫరాజ్ అహ్మద్, అసద్ షఫీక్‌లతో కలిసి మిస్బా నలుగురు సభ్యుల సెలక్షన్ కమిటీలో నియమితుడయ్యాడు. సెలక్షన్ కమిటీతో పాటు, లాహోర్‌లోని నేషనల్ క్రికెట్ అకాడమీలో బ్యాటింగ్ కన్సల్టెంట్ పదవికి కూడా అతడు రాజీనామా చేసినట్లు సమాచారం. అయితే, పీసీబీ అతడి రాజీనామాను ఇంకా అధికారికంగా ఆమోదించలేదు.2017లో ఆటకు వీడ్కోలు పలికిన మిస్బా, గతంలో పాకిస్థాన్ జట్టుకు హెడ్ కోచ్‌గా, చీఫ్ సెలక్టర్‌గా కూడా పనిచేశాడు. తాజా పరిణామాలతో పాకిస్థాన్ క్రికెట్‌లో నెలకొన్న గందరగోళం మరింత స్పష్టంగా కనిపిస్తోంది.






## రష్మిక నుంచి బ్యాక్ టూ బ్యాక్ సినిమాలు.. మైసా రిలీజ్ డేట్ ప్రకటించిన మేకర్స్

నేషనల్ క్రష్ రష్మిక మందన్న ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉంది. ఇప్పటికే విభిన్నమైన కథలు, పాత్రలను ఎంచుకుంటూ పాన్ ఇండియా స్థాయిలో తన మార్కెట్‌ను మరింత పెంచుకుంటున్న ఈ భామ.. ఇప్పుడు మరో ఆసక్తికరమైన సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. రష్మిక ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న పాన్ ఇండియా మూవీ 'మైసా' విడుదల తేదీ ఖరారైంది. 'మైసా' చిత్రాన్ని 2026 నవంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా రష్మిక చేతిలో ఈటె పట్టుకుని, అత్యంత పవర్‌ఫుల్ లుక్‌లో కనిపించే ఇంటెన్స్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్ సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేసింది. ఇప్పటివరకు గ్లామర్, లవ్, ఫ్యామిలీ, కామెడీ వంటి విభిన్న పాత్రల్లో కనిపించిన రష్మిక.. 'మైసా'లో మాత్రం పూర్తిగా భిన్నమైన అవతార్‌లో కనిపించనుంది. ఇందులో ఆమె గోండ్ గిరిజన మహిళ, తిరుగుబాటుదారిణి పాత్రలో నటిస్తున్నట్లు సమాచారం. పాత్ర కోసం రష్మిక తన లుక్, బాడీ లాంగ్వేజ్‌లోనూ భారీ మార్పులు తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. 'మైసా' కథ గిరిజన ప్రాంతాల నేపథ్యంలో సాగుతుందని తెలుస్తోంది. అక్కడి ప్రజల జీవన విధానం, వారి నమ్మకాలు, సమస్యలు, పోరాటం వంటి అంశాలను కథలో చూపించనున్నట్లు సమాచారం. ముఖ్యంగా రష్మిక పాత్ర చుట్టూనే కథనం ఎక్కువగా నడుస్తుందని టాక్. ఈ సినిమాలో రష్మిక ఇప్పటివరకు చేయని యాక్షన్ షేడ్స్‌తో కూడిన పాత్రలో కనిపించనుంది. చేతిలో ఈటె పట్టుకుని కనిపిస్తున్న పోస్టర్ చూస్తే.. సినిమాలో ఆమె పాత్ర ఎంత పవర్‌ఫుల్‌గా ఉండబోతోందో అర్థమవుతోంది. ఈ సినిమా కోసం రష్మిక అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. 'మైసా'తో రవీంద్ర పుల్లె దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ కొనసాగుతోంది. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని అనిల్, అజయ్ సయ్యపురెడ్డి, శ్రీకాంత్ సాతి కలిసి అన్‌ఫార్ములా ఫిల్మ్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు.ఈ చిత్రానికి జేక్స్ బిజోయ్ సంగీతం అందిస్తున్నారు. తారక్ పొన్నప్ప కీలక పాత్రలో నటిస్తున్నారు. కథకు తగ్గట్టుగా భారీ యాక్షన్ సన్నివేశాలు, గిరిజన నేపథ్యాన్ని ప్రతిబింబించే విజువల్స్‌కు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలుస్తోంది.ఇదిలా ఉంటే రష్మికకు 2026 చివరి రెండు నెలలు మరింత ప్రత్యేకంగా మారనున్నాయి. ఇప్పటికే విజయ్ దేవరకొండతో కలిసి నటిస్తున్న 'రణబలి' చిత్రం అక్టోబర్ 16న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఆ తర్వాత కేవలం 42 రోజుల వ్యవధిలోనే 'మైసా' నవంబర్ 27న విడుదల కానుంది.

## 'కల్కి2'పై బిగ్ అప్‌డేట్..!





దుల్కర్ సల్మాన్ హీరోగా తెరకెక్కిన పాన్ ఇండియా యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఐయామ్ ది గేమ్'. ఈ చిత్రం సెప్టెంబర్ 3న ప్రేక్షకుల ముందుకు రానుంది. వేఫెరర్ ఫిలిమ్స్ సమర్పణలో నహాస్ హిదాయత్ దర్శకత్వంలో దుల్కర్ సల్మాన్, జోమ్ వర్గీస్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన ప్రీ రిలీజ్ ఈవెంట్ హైదరాబాద్‌లోని పార్క్ హయత్ హోటల్‌లో సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన నాగ్ అశ్విన్ మాట్లాడుతూ 'కల్కి2'కి సంబంధించిన అప్‌డేట్‌ను పంచుకున్నారు. ఇప్పుడీ వీడియో వైరల్ అవుతోంది.

'ఇప్పటివరకు పది రోజుల షూటింగ్ చేశాం. ఇంకా చాలా చేయాల్సి ఉంది. ప్రభాస్‌కు సమయం దొరకపోవడంతో లేట్ అవుతుంది. అతనికి సమయం దొరికాక పెద్ద షెడ్యూల్ ప్లాన్ చేస్తాం' అని వెల్లడించారు.

2024లో విడుదలై..

కాగా ప్రభాస్ – నాగ్ అశ్విన్ కాంబోలో వచ్చిన బ్లాక్‌బస్టర్ హిట్ 'కల్కి 2898 ఏడీ'. 2024 జూన్ 27న విడుదలైన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద రూ.1100 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దిశాపటానీ, దీపికా పదుకొణె కీలక పాత్రల్లో నటించారు. ఇప్పుడు 'కల్కి2' కోసం అభిమానులు ఎదురు చూస్తున్నారు. ఈ తరహాలో 'కల్కి2'కి సంబంధించిన అప్‌డేట్ అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపుతోంది.

## దుల్కర్ సల్మాన్ 'ఐయామ్ గేమ్'కు లెంగ్తీ రన్ టైం..!

దుల్కర్ సల్మాన్ నటిస్తోన్న యాక్షన్ థ్రిల్లర్ ఐయామ్ గేమ్. నిహాస్ హిధయత్ డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీ ముందుగా అనుకున్న షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 20న విడుదల కావాల్సింది. కానీ పలు కారణాల వల్ల సెప్టెంబర్ 3 ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఒకేసారి పలు ప్రధాన భాషల్లో విడుదల కానుంది. ఐయామ్ గేమ్ సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకుంది. ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు క్లీన్ యూ/ఏ 16ం సర్టిఫికెట్ జారీ చేసింది. ఈ చిత్రానికి రన్ టైం 173 నిమిషాలు (2 గంటల 57 నిమిషాలు). రన్ టైం ఎక్కువ కావడం కారణంగా ఆడియెన్స్‌ను ఎంగేజ్ చేయాలంటే స్టోరీ, స్క్రీన్ ప్లే చాలా కీలకం. మరి డైరెక్టర్ లెంగ్తీ రన్ టైం సినిమా చూసేలా ప్రేక్షకులను ఎలా కుర్చీలకు కట్టిపడేస్తాడో చూడాలి. ఈ చిత్రంలో కయాదు లోహర్, ఆంటోనీ వర్గీస్, మిస్కిన్, కథిర్, సంయుక్తా విశ్వనాథన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.





## 'ఇరుముడి'తో రవితేజ.. 'మారెమ్మ'తో తమ్ముడి కొడుకు

'ఇరుముడి' హిట్ కొట్టిన రవితేజ మంచి జోష్‌లో ఉన్నాడు. ఇప్పుడు ఇతడి ఇంటి నుంచి మరో హీరో రాబోతున్నాడు. రవితేజ తమ్ముడు రఘు కొడుకు మాధవ్ ప్రధాన పాత్ర చేసిన 'మారెమ్మ' విడుదలకు సిద్ధమైంది. వచ్చే శుక్రవారం(సెప్టెంబరు 10) ఈ మూవీ థియేటర్లలో రిలీజ్ కానుంది. ఈ క్రమంలోనే తాజాగా ట్రైలర్ వదిలారు. ఇది ఆకట్టుకునేలా ఉంది. గతంలో 'లవ్ యూ ఇడియట్' అనే మూవీలో మాధవ్ హీరోగా పరిచయమయ్యాడు. కానీ ఇదొచ్చిందా లేదా అనే సంగతి జనాలకు పెద్దగా తెలీదు. తర్వాత విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే 'మారెమ్మ' ఒప్పుకొన్నాడు. ఏడాది క్రితం దీని గురించి ప్రకటన వచ్చింది. కొన్నిరోజుల క్రితం మూవీ రిలీజ్ డేట్ ప్రకటించారు. ఇప్పుడు ట్రైలర్ విడుదల చేశారు. మారెమ్మ అనే గ్రామ దేవత, ఈ దేవి కోసం పెంచే ఓ దున్నపోతు. దాన్ని కాపాలా కాసే ఓ కాపరి. ఊరిలో జరిగే కొన్ని అరిష్టాలు. ఇలా ట్రైలర్ సాగింది. తెలంగాణలోని ఓ పల్లె నేపథ్యంగా మూవీ ఉండనుంది. ఇందులో మాధవ్ సరసన దీపా బాలు హీరోయిన్‌గా చేసింది. మంచాల నాగరాజు దర్శకుడు. ఈ సినిమాతోనైనా మాధవ్ హీరోగా సక్సెస్ అందుకుంటాడేమో చూడాలి?

I PRINTED, PUBLISHED & OWNED By M.SUNIL KUMAR at printed at Global printers #10 MIE Industrial Estate,Kallur,kurnool,Andhrapradesh.
Published from Hno: 4-86-1 New postal Colony,Balaji nagar,Kurnool,Andhrapradesh- 518003.EDITOR : M.sunil kumar, #1/339/17, sree ram nagar, bharpet,near nobel college ,ram-jal road Adoni kurnool district- 518301 Andhra Pradesh. E-mail: Suryaudhayamdaily@gmail.com